

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్లలో ఎంతో ప్రగతి సాధించాం. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ పారదర్శకమైన పాలన సాగిస్తున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభం కావడం ఓ చారిత్రాత్మక విజయం.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



మంగళవారం 04.08.2026

INK OF TRUTH


# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 104 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# నీటికి నిఘా.. నిబంధనలకు కత్తెర

- తాగునీటి ఎద్దడి సమస్యపై దృష్టిపెట్టండి
- రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించండి
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు





**అమరావతి, ఆగస్టు 3 (జర్నలిస్ట్ ఫైల్):** ఎల్ నినో పరిస్థితుల కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి ఎద్దడి సమస్యపై దృష్టిపెట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను, రిజర్వాయర్లలో, నీటి వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఎగువన వర్షాలు కురుస్తున్నందున్న కృష్ణా బేసిన్ లో నీటి లభ్యత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయని అధికారులు వివరించారు. కృష్ణానదిలో కొద్ది రోజులుగా ప్రవాహాలు మొదలైనట్లు వివరించారు. అలాగే గోదావరిలో వరద పరిస్థితిని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. కృష్ణా బేసిన్లో ఎగువ నుంచి వచ్చే వరదను సద్వినియోగం చేసుకునేలా నీటి నిర్వహణ చేపట్టాలని సీఎం ఆదేశించారు. వర్షాభావం వల్ల రానున్న రోజుల్లో పశుగ్రాసం కొరత వచ్చే అవకాశం ఉందని...దీనికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాల్లో తరుచూ తాగునీటి పరీక్షలు జరపాలని... ల్యాబ్ టెస్టుల నివేదికలను విడుదల చేయాలని సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి... అంగన్వాడీ కేంద్రాలను తనిఖీలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రవాణ శాఖలో పూర్తి స్థాయి టెక్నాలజీ వినియోగం, అనవసర నిబంధనల తొలగింపు వంటి అంశాలకు తీసుకుంటున్న చర్యలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్, ఫారం-5దీ వంటి పరీక్షలను తొలగించడం వంటి చర్యల ద్వారా అవినీతిని తగ్గించడం, సులభతర సేవలను అందించే అవకాశం కలుగుతుందని అధికారులు చెప్పారు. దశలవారీగా రవాణా శాఖలో ఈ సంస్కరణలు చేపట్టేలా తాము ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు. వీలైనంత మేరకు అనవసర నిబంధనలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ.. 20 లక్షల జైత్రయాత్ర



- రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా సాగుతున్న టీడీపీ కార్యక్రమం
- ఒక్కరోజే 3 లక్షలకు పైగా ఇళ్లను చేరిన పార్టీ శ్రేణులు

**అమరావతి, ఆగస్టు 3 (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగుదేశం పార్టీ రెండేళ్ల సుపరిపాలనపై ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం - 2026, 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి-సంక్షేమం" కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా దిగ్విజయంగా కొనసాగుతోంది. ఈ ఎనిమిది రోజుల పాటు టీడీపీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ఇంటింటి వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరిస్తూ సరికొత్త మైలురాయిని అధిగమించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా, నేడు ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షలకు పైగా ఇళ్లను టీడీపీ శ్రేణులు సందర్శించాయి. దీంతో ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు మొత్తం 20.61 లక్షల ఇళ్ల మార్క్ను విజయవంతంగా దాటింది.

సోమవారం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అత్యంత ఉత్సాహంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా భారీ సంఖ్యలో ఇళ్లను టీడీపీ శ్రేణులు సందర్శించి, ప్రభుత్వం మిగతా 2లో...

# ఆలయాలను సాంస్కృతిక శిక్షణ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి

## బీజేపీ జనతా వారధిలో కళాకారుల వినతులు..

## ప్రభుత్వానికి రెండు కీలక ప్రతిపాదనలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



**విజయవాడ, ఆగస్టు 3 (జర్నలిస్ట్ ఫైల్):** ఆలయాలను కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం చేయకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళలు, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించే సాంస్కృతిక శిక్షణ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన "జనతా వారధి" కార్యక్రమంలో వివిధ సంప్రదాయ కళాకారుల సమస్యలను విన్న అనంతరం ఈ మేరకు ప్రభుత్వానికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

రాష్ట్రంలోని భజన మండళ్లు, కోలాట బృందాలు, హరికథకులు, జానపద కళాకారులు, కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనృత్య కళాకారులు, బుర్రకథ, యక్షగానం, తోలుబొమ్మలాట, వీధి భాగవతం, చెక్కభజన, డప్పు, థింసా, ఒగ్గుకథ, గరగ నృత్యం, నాగస్వరం-మంగళ వాయిద్య కళాకారులు, వేదపారాయణం, అన్నమాచార్య, త్యాగరాజ, రామదాసు కీర్తనల గాయకులు తమ సమస్యలను వివరించినట్లు తెలిపారు.

ప్రస్తుతం అనేక మంది సంప్రదాయ కళాకారులు ఆలయాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతులు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. దీంతో ప్రైవేట్ హాళ్లను అద్దెకు తీసుకుని శిక్షణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, దీనివల్ల పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు సంప్రదాయ కళలకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు.

దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో దశలవారీగా మిగతా 2లో...

# రైతు సమ్మతితోనే భూసమీకరణ

- రైల్వే లైన్, ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం రైతులతో మంత్రి నారాయణ చర్చ
- ల్యాండ్ పూలింగ్ గడువు రైతుల అభిప్రాయం మేరకేనని స్పష్టీకరణ



**గుంటూరు, ఆగస్టు 3 (జర్నలిస్ట్ ఫైల్):** రాజధాని ప్రాంత రైతుల ప్రయోజనాలను కాపాడుతూ అభివృద్ధి ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. మిగతా 2లో...

# శ్రీశైలం ప్రొటోకాల్‌కు కొత్త నిబంధనలు

- స్పర్శదర్శనం, వసతి కోసం రెండు రోజుల ముందే సిఫార్సు లేఖలు పంపాలి
- శ్రావణ రద్దీ దృష్ట్యా దర్శనాల్లో మార్పులు.. ఈవో శ్రీనివాసరావు వెల్లడి



**శ్రీశైలం, ఆగస్టు 3 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం వచ్చే ప్రముఖులు దర్శనం, వసతి గదుల కోసం మిగతా 2లో...

# తీర రక్షణకు 'గ్రేట్ గ్రీన్‌వాల్'

- రెండు నెలల్లో 2026-27 లక్ష్యాల పూర్తి
- తీర రక్షణకు 8,888 హెక్టార్లలో పచ్చని కవచం..
- మరో 70 లక్షల మొక్కలతో విస్తరణ







**అమరావతి, ఆగస్టు 3 (జర్నలిస్ట్ ఫైల్):** తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, కోతల నివారణ చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టు గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పనుల్లో వేగం మరింత పెరగాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాలను వాతావరణ అనుకూలతలకు అనుగుణంగా వచ్చే రెండు నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్య సాధనలో భాగంగా గడచిన రెండేళ్ల కాలంలో సాధించిన పురోగతికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిన అంశాన్ని గుర్తు చేశారు. మడ అడవుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధించేందుకు కృషి చేసిన అధికారులను అభినందించారు.

సోమవారం మధ్యాహ్నం గ్రేట్ గ్రీన్ వాల్ పనుల పురోగతిపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. డివిజన్ల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు ఎంతవరకు మిగతా 2లో...

# బీజేపీ కంచుకోటలో ప్రశాంత్ కిశోర్ విజయం



- బాంకీపూర్ ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీకి తొలి ఎమ్మెల్యే

**పాట్నా, ఆగస్టు 3 (జర్నలిస్ట్ ఫైల్):** బీహార్ రాజకీయాల్లో కీలక పరిణామంగా భావిస్తున్న బాంకీపూర్ అసెంబ్లీ ఉపఎన్నికలో ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌పై గెలుపొందిన ఆయన, పార్టీకి తొలి అసెంబ్లీ విజయాన్ని అందించారు.

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ అయిన బాంకీపూర్ స్థానానికి ఈ ఉపఎన్నిక జరిగింది. మిగతా 2లో...

# ఆక్సిజన్ లెక్కలు తేల్చండి!



- కోవిడ్ తర్వాత పెరిగిన కొనుగోళ్లపై సమగ్ర ఆడిట్‌కు ఆదేశం
- రూ.105 కోట్లతో నిర్మించిన 161 పీఎస్ఏ ప్లాంట్ల వినియోగంపై నివేదిక కోరిన మంత్రి సత్యకుమార్ యాదవ్

**అమరావతి, ఆగస్టు 3 (జర్నలిస్ట్ ఫైల్):** కోవిడ్-19 నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఆక్సిజన్ సరఫరా కోసం దాదాపు రూ. 105 కోట్లతో నిర్మితమై నిరుపయోగంగా మారిన పీఎస్ఏ (ప్రెషర్ స్వింగ్ అడ్సార్ప్షన్) ప్లాంట్లు, అధిక మోతాదులో ఎల్ఎంఓ (లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్) కొనుగోళ్ల విషయాలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారంనాడు మంగళగిరి ఎపిఐఐసి టవర్స్‌లోని వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఉన్నతాధికారులతో రెండు గంటలపాటు లోతుగా సమీక్షించారు. ఎల్ఎంఓ కొనుగోళ్లకు సంబంధించి, వాస్తవ డిమాండ్, సరఫరా విషయాలపై రెండు వారాల్లో సమగ్రంగా ఆడిట్ నిర్వహించి, లోపాల గుర్తింపు, సవరణ చర్యలను చేపట్టి, ఆమేరకు ఎనిమిది ప్రభుత్వాసుపత్రుల్లో రెండు నెలలపాటు అమలుపరిచి అక్టోబరు 15 లోగా సమగ్ర నివేదికను సమర్పించాలని మంత్రి ఆదేశించారు. తద్వారా ఎల్ఎంఓ డిమాండ్ మరియు సరఫరాలోని వ్యత్యాసాన్ని గుర్తించి ఆక్సిజన్ కొనుగోలు ఖర్చును వీలైనంత వరకు కొవిడ్-19 పూర్వ స్థితికి తీసుకురావాలని మంత్రి స్పష్టంచేశారు. మిగతా 2లో...

## ఇంటింటికీ.. 20 లక్షల జైత్రయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాయి.

అన్ని జిల్లాల్లో ప్రజల నుంచి లభిస్తున్న అపూర్వ ఆదరణ ఈ కార్యక్రమంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ అన్నారు. 20 లక్షల మార్క్ దాటడంపై ఆయన కార్యకర్తలు, శ్రేణులను అభినందించారు.

## ఆలయాలను సాంస్కృతిక శిక్షణ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉచిత సాంస్కృతిక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతిరోజూ కనీసం గంటపాటు శిక్షణ నిర్వహించాలని సూచించారు. స్థానిక కళాకారులను పార్ట్‌టైమ్ శిక్షకులుగా నియమించి పారితోషికం అందించడంతో పాటు శిక్షణ పూర్తిచేసిన వారికి ధ్రువపత్రాలు ఇవ్వాలని, ఆలయ ఉత్సవాల్లో ప్రదర్శన అవకాశాలు కల్పించాలని కోరారు.

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)తో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు కళాకారుల ఎంపికలో పారదర్శక విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంప్రదాయ కళాకారుల నమోదు చేపట్టి, జిల్లా స్థాయిలో అర్హతలను పరిశీలించి డిజిటల్ డేటాబేస్ రూపొందించాలని సూచించారు. నమోదిత జాబితా ఆధారంగానే కళాకారులను ఎంపిక చేయడంతో పాటు ఎంపిక ప్రమాణాలు, పారితోషికం, ప్రదర్శనల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రతి జిల్లాకు తగిన ప్రాతినిధ్యం కల్పించి, కళాకారుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

సనాతన ధర్మం, భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళల పరిరక్షణకు ఆలయాలను జీవంతమైన కేంద్రాలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాలని పీవీఎన్ మాధవ్ కోరారు. అలాగే ఈ అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు బీజేపీ నాయకులు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు.

## బీజేపీ కంచుకోటలో ప్రశాంత్ కిశోర్ విజయం

(మొదటి పేజీ తరువాయి)

1995 నుంచి బీజేపీకి కంచుకోటగా కొనసాగుతున్న ఈ నియోజకవర్గంలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

గత ఏడాది జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. తాజా ఉపఎన్నికలో సాధించిన విజయం ఆ పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఫలితాలు వెలువడిన వెంటనే పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు.

విజయం అనంతరం ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ, బాంకీపూర్ ప్రజలు బీజేపీ నాయకత్వానికి స్పష్టమైన సందేశం ఇచ్చారని అన్నారు. బీహార్‌కు సమర్థవంతమైన, నిజాయితీ గల నాయకత్వం అవసరమని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థ మెరుగుపడాలని, యువతకు రాష్ట్రంలోనే ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజల ఆకాంక్షగా వివరించారు.

ప్రధాని నరేంద్ర మోదీకి బీహార్ ప్రజలు గతంలో విశేష మద్దతు ఇచ్చారని, గుజరాత్ అభివృద్ధికి చూపిన శ్రద్ధలో కొంతైనా బీహార్‌పై చూపించాలని కేంద్రాన్ని కోరారు. బీహార్ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే బాంకీపూర్ పూర్తిగా మారిపోదని, అయితే రానున్న రెండు, మూడు నెలల్లో అభివృద్ధి దిశగా మార్పులు కనిపించేలా కృషి చేస్తానని చెప్పారు. తమ పోరాటం వ్యక్తులపై కాదని, వ్యవస్థల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యమని ప్రశాంత్ కిశోర్ స్పష్టం చేశారు.

రాజకీయ వ్యూహకర్తగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రశాంత్ కిశోర్, ఈసారి నేరుగా ఎన్నికల బరిలోకి దిగి బీజేపీ బలమైన నియోజకవర్గంలో విజయం సాధించడం బీహార్ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

## శ్రీశైలం ప్రొటోకాల్‌కు కొత్త నిబంధనలు



(మొదటి పేజీ తరువాయి)

తమ సిఫార్సు లేఖలను 2 రోజులు ముందుగా దేవస్థానానికి పంపాలని ఈవో ఎం.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. సిఫార్సు లేఖలు ఉన్నవారికి శని, ఆది, సోమవారాల్లో ఉదయం, మధ్యాహ్నం వేళల్లో స్పర్శదర్శనం ఉండదని, రాత్రివేళ అనుమతిస్తామన్నారు.

మంగళవారం నుంచి గురువారం వరకు రోజుకు యథావిధిగా 3 విడతలు స్పర్శదర్శనం కల్పిస్తున్నట్లు ఈవో చెప్పారు. శ్రావణమాసంలో శుక్రవారం రాత్రి పరిమితంగా స్పర్శదర్శనానికి అనుమతించనున్నట్లు చెప్పారు. సిఫార్సు లేఖలను protocol@srisailadevasthanam.org, ప్రొటోకాల్ వాట్సప్ నంబరు 91600 16215కు పంపాలని కోరారు.

**ప్రయాణానికి ముందే :** స్వామి దర్శనం కోసం శ్రీశైలం వచ్చే భక్తులు ప్రయాణానికి ముందే ఆలయ అధికారిక వెబ్‌సైట్‌లో వసతి గదులు ఆర్జిత సేవా టికెట్లను బుక్ చేసుకోవడం ఉత్తమం. క్యూలైన్లలో గంటల కొద్దీ వేచి ఉండే భక్తుల కోసం దేవస్థాన సిబ్బంది పాలు, మజ్జిగ, తాగునీరు, అల్పాహారం వంటి వసతులను అందిస్తోంది. సామాన్య భక్తులందరికీ మల్లన్న దివ్య దర్శనం సజావుగా సాగేలా చూడటమే ఈ మార్పుల ముఖ్య ఉద్దేశం అని అధికారులు తెలిపారు. భక్తులు శ్రీశైల మహాక్షేత్రానికి వెళ్లే ముందు అధికారుల సూచనలను పాటిస్తూ సిబ్బందికి సహకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**మల్లన్న దర్శనం కోసం :** శ్రీశైల మల్లన్న దర్శనం కోసం భక్తులు భారీగా తరలి వస్తున్నారు. భక్తుల రద్దీ ఎక్కువవడంతో స్పర్శ దర్శనాలను ఆన్‌లైన్ ద్వారా ముందుగా బుక్ చేసుకున్న వారికే కల్పించారు. మిగతా భక్తులకి అలంకార దర్శనాలు మాత్రమే కల్పించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో కంపార్టుమెంట్లు, క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అల్పాహారాలు, మజ్జిగ, పాలు, తాగునీరు అందించారు.

**ప్రొటోకాల్ దర్శనాల్లో సంస్కరణలు :** ఇటీవల శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఛైర్మన్ రమేశ్ నాయుడు ఆధ్వర్యంలో సమావేశమైన సభ్యుల కమిటీ 39 అంశాలకు ఆమోదం తెలిపింది. శ్రీశైలం దేవస్థానం ప్రొటోకాల్ దర్శనాల్లో సంస్కరణలు చేపట్టినట్లు ఛైర్మన్ వెల్లడించారు. ఈ నెల 15 నుంచి తిరుమల తరహాలో శ్రీశైలంలోనూ ఆన్‌లైన్ ప్రొటోకాల్ టికెట్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో శ్రీశైలంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టబోతున్నట్లు చెప్పారు.

# ఆక్సిజన్ లెక్కలు తేల్చండి!

(మొదటి పేజీ తరువాయి)

**భారీగా పెరిగిన ఆక్సిజన్ కొనుగోలు వ్యయం :** కోవిడ్-19 తీవ్రంగా ఉన్న 2020-21, 2021-22 సంవత్సరాల్లో రూ. 95.43 కోట్ల మేరకు బోధనాసుపత్రుల్లో ఎల్ఎంఓ కొనుగోలు చేశారు. కోవిడ్-19కు ముందు 2016-20 మధ్య కాలంలో (నాలుగేళ్లు) రూ. 60.51 కోట్ల మేరకు వ్యయం చేశారు. కొవిడ్ అనంతరం 2022-26 మధ్య నాలుగేళ్ల కాలంలో ఎల్ఎంఓ కొనుగోలు వ్యయం రూ. 180.82 కోట్లకు చేరిందని మంత్రి సమీక్షా సమావేశంలో గుర్తించారు. గత నాలుగేళ్లలో కొత్త బోధనాసుపత్రులు, కొత్త ఆసుపత్రులు ఉనికిలోకి రావడం, పడకలు పెరగడం పెరుగుదలకు కొంతమేరకు కారణమైనప్పటికీ అధికారులు వివరించిన ఆక్సిజన్ డిమాండ్, వాస్తవ సరఫరాకు మధ్య భారీ అంతరం కనిపిస్తోందని, దీనిపై లోతుగా పరిశీలించి కొనుగోలు వ్యయాన్ని తగ్గించే దిశగా అవకాశాలను పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. ఈ పరిశీలనకు అనంతపురం బోధనాసుపత్రి (సూపర్ స్పెషాలిటీతో సహా), గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం బోధనాసుపత్రులతోపాటు రెండు జిల్లా, రెండు ఏరియా ఆసుపత్రులను ఎంపిక




చేశారు. ఆరోగ్య పథకాల అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్న 'పాత్' సంస్థ ఈ అధ్యయనాన్ని చేపడుతుంది.

**పిఎస్ఎ ప్లాంట్లు ఉపయోగమా..నిరర్థకమా? :** కోవిడ్-19 నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సాయంతో డీఎంఈ పరిధిలో 62 ఆసుపత్రుల్లో, సెకండరీ హెల్త్ పరిధిలో 100 (మొత్తం 162) పీఎసీ ప్లాంట్లను ఏర్పాటుచేశారు. అయితే ఈ ప్లాంట్ల ద్వారా తయారయ్యే ఆక్సిజన్ ప్యూరిటీ (నాణ్యత), నిర్వహణా నియంత్రణకు సంబంధించి తగిన సాంకేతి సిబ్బందని నియమించకపోవడం, ఐసీయూ మరియు సాధారణ వార్డులకు ఆక్సిజన్ సరఫరాకు సంబంధించిన నాణ్యతతో నిమిత్తం లేకుండా ఒకే పైపులైన్ వ్యవస్థ ఉండడంవంటి వివిధ కారణాలవల్ల 162 కు 161 పీఎస్ఎ ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. ఈ ప్లాంట్ల మరమ్మతులకు డిఎంఈ పరిధిలో రూ. 6.20 కోట్లు, నిర్వహణకు ఏటా రూ. 2.60 కోట్లు, డియస్‌హెచ్ పరిధిలో మరమ్మతులకు రూ. 4.76 కోట్లు, నిర్వహణ కోసం ఏటా రూ 6.7 కోట్లు అవసరమవుతుందని, మంత్రికి వివరించారు. ఈ మేరకు నిధులు ఖర్చుచేసిన ఈ పీఎసీ ప్లాంట్లను పూర్తిస్థాయిలో వినియోగించవచ్చా? ఆర్థికంగా ఈ ఖర్చు సమర్థనీయమా? కాకుంటే ఈ నిరర్థక ప్లాంట్లను ఏంచేయాలన్న విషయాలపై కూడా నివేదిక తెప్పించాలని మంత్రి ఆదేశించారు. రాజస్థాన్ రాష్ట్రంలో పీఎస్ఏ ప్లాంట్ల పనితీరును కూడా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు

**తక్షణ చర్యలకు మంత్రి ఆదేశం :** కోవిడ్-19 నేపథ్యంలో భారీగా పెరిగిన ఎల్ఎంఓ కొనుగోలును వీలైనంతమేర తగ్గించేందుకు బోధనాసుపత్రుల్లో తక్షణ చర్యలు చేపట్టేలా చూడాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు ఆసుపత్రుల్లో ఎల్ఎంఓ నిల్వ, సరఫరాల్లో ఆక్సిజన్ లీక్ అవుతున్నట్లు సమాచారం ఉన్నందున ఈ విధమైన వృథాను తగ్గించేందుకు వెంటనే పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటుచేయాలని, ఆ మేరకు ఆసుపత్రులకు వెంటనే ఆదేశాలివ్వాలని మంత్రి అధికారులకు సూచించారు. వార్డుల స్థాయిలో, ఐసియులో పడకల స్థాయిలో ఆక్సిజన్ సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని రికార్డు చేయాలని కూడా మంత్రి ఆదేశించారు. ఎల్ఎంఓ సరఫరా, వినియోగానికి సంబంధించి అధ్యయన కమిటీ నివేదిక అందిన వెంటనే మరో సమీక్ష నిర్వహించి అక్సిజన్ కొనుగోలు వాస్తవ డిమాండ్ మేరకే జరిగేలా స్పష్టమైన ఆదేశాలను మంత్రిత్వ శాఖ జారీచేస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు ఈ సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్, ఏడీఎంఈ డాక్టర్ రాధికారెడ్డి, డీఎంఈ జాయింట్ డైరెక్టర్ గణపతిరావు, డీఎస్ఎచ్ జాయింట్ కమిషనర్ డాక్టర్ సుజాత, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పుష్కరాల నాటికి ఇంటింటా గోదారి!

- జల్ జీవన్ మిషన్‌తో శుద్ధి చేసిన తాగునీటి సరఫరా
- మార్చి 2027 నాటికి పనులు పూర్తి చేయాలని మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు, ఆగస్టు 3 (జర్నలిస్ట్ ఫైల్):** గోదావరి నీరు చెంతనే ఉన్నప్పటికీ, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజల కష్టాలకు త్వరలోనే విముక్తి లభిస్తుందని, గోదావరి పుష్కరాల నాటికి ఇంటింటికి శుద్ధి చేసిన గోదావరి జలాలను సరఫరా చేసే బాధ్యత తమదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. సోమవారం నిడదవోలు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన ఆయన పెరవలి మండలంలో వేగంగా జరుగుతున్న 'జల్ జీవన్ మిషన్' పనులను మరియు ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. గతేడాది పెరవలిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిన జల్ జీవన్ మిషన్ పనులను గుర్తుచేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా జల్ జీవన్ మిషన్ పనులు జరగలేదని విమర్శించారు.. అంతేగాక భూగర్భ జలాలు కలుషితమై అడుగంటిపోతున్న నేపథ్యంలో గోదావరి జలాలను శుద్ధి చేసి అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇందులో భాగంగా విజ్జేశ్వరం వద్ద 500 కిలో లీటర్ల నీటిని శుద్ధి చేసేలా అత్యాధునిక ఎస్‌టీపీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అక్కడి నుండి ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల ద్వారా ప్రతి గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకు నీరు చేరుతుందని అక్కడి నుండి ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా నాణ్యమైన తాగునీటిని సరఫరా చేస్తామని వివరించారు. ప్రధానంగా తాను ఇప్పుడు పరిశీలించిన ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా దాదాపు 15 గ్రామాల ప్రజలకు 60 వేల లీటర్ల శుద్ధి చేసిన మంచినీరు అందుబాటులోకి రానుందన్నారు. ఈ ప్రాజెక్టు పనులను మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని, రాబోయే గోదావరి పుష్కరాల నాటికి ప్రతి ఇంటికీ మంచినీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్ట్ సంస్థను ఆదేశించారు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి శరవేగంగా పూర్తి చేస్తోందని, పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్న స్థానిక కూటమి నాయకులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు.

అంతకుముందు నిడదవోలు పట్టణంలోని ఉజ్జనివారి వీధిలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యపై స్థానికులు మంత్రి దుర్గేష్‌కి విన్నవించగా ఆయన తక్షణమే స్పందించారు. ఘటనాస్థలిని సందర్శించి అధికారులను ఆదేశించడంతో అధికారులు అత్యవసర చర్యలు చేపట్టి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. నేడు ఆ పనులను స్వయంగా పరిశీలించిన మంత్రి దుర్గేష్ స్థానికులతో మాట్లాడి త్వరలోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

## రైతు సమ్మతితోనే భూసమీకరణ



(మొదటి పేజీ తరువాయి)

రైల్వే లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులకు అవసరమైన భూముల సమీకరణపై సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో రైతులతో సమావేశమై చర్చించారు.

తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ, సీఆర్డీఏ అదనపు కమిషనర్ భార్గవ తేజతో కలిసి తాడికొండ, మోతడక, కంతేరు గ్రామాల రైతులతో మంత్రి సమావేశమయ్యారు. భూసమీకరణకు సంబంధించిన అంశాలను రైతులకు వివరించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాడికొండ, మోతడక గ్రామాల రైతులు ల్యాండ్ పూలింగ్‌కు సానుకూలంగా స్పందించారని తెలిపారు. కంతేరు గ్రామ రైతులు మరోసారి గ్రామంలోని రైతులతో చర్చించి తమ నిర్ణయాన్ని వెల్లడిస్తామని చెప్పారని వివరించారు. రైతుల అభ్యర్థన మేరకు ల్యాండ్ పూలింగ్‌కు తగిన కాలవ్యవధిని నిర్ణయిస్తామని పేర్కొన్నారు. రాజధాని ప్రాంత రైతులకు మేలు జరిగేలా అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నామని, అభివృద్ధి--రైతు ప్రయోజనాలు రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు.

సమావేశంలో సీఆర్డీఏ అదనపు కమిషనర్ కార్తీక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి, ఇతర అధికారులు, మూడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ప్రముఖ న్యాయవాది సీహెచ్ వెంకటేశ్వరరావు కన్నుమూత

- పన్ను, జీఎస్టీ కేసుల నిపుణుడిగా విశేష సేవలు
- ఎపి సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ పెన్షనర్స్ అసోసియేషన్ తీవ్ర దిగ్భ్రాంతి

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, సర్వీస్ ట్యాక్స్, సేల్స్ ట్యాక్స్, జీఎస్టీ, ఏసీబీ, సీబీఐ కేసుల్లో కన్సల్టెంట్, న్యాయవాదిగా విశేష సేవలందించిన ప్రముఖ న్యాయవాది సీహెచ్ వెంకటేశ్వరరావు ఆదివారం రాత్రి కన్నుమూశారు. గుంటూరు బ్రాడీపేటలోని స్వగృహంలో



వయోభారంతో తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 93 సంవత్సరాలు.

వెంకటేశ్వరరావు గతంలో గుర్రంపై తిరుగుతూ కేసుల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు. దీంతో ఆయనకు "గుర్రాల వెంకటేశ్వరరావు"గా ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. తన వద్దకు వచ్చే ప్రతి క్లయింట్‌కు ధైర్యం చెప్పి, న్యాయపరమైన సూచనలు అందించడంలో ఆయన ప్రత్యేక పేరు సంపాదించారు. 90 ఏళ్లు దాటిన తర్వాత కూడా అదే ఉత్సాహంతో న్యాయవృత్తిని కొనసాగిస్తూ, కేసుల కోసం ఢిల్లీ, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు సైతం ప్రయాణించేవారు.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ట్రాన్స్‌లేటర్‌గా కూడా సేవలందించిన వెంకటేశ్వరరావు న్యాయరంగంలో విశేష అనుభవాన్ని కలిగి ఉన్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ ఇటీవల సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరించారు.

వెంకటేశ్వరరావు మృతిపట్ల ఏపీ సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ పెన్షనర్స్ అసోసియేషన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. సంఘ నాయకులు టి. వివేకానంద, పి.వి. సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి. కోటేశ్వరరావు, ఎన్.ఎస్. నగేష్ బాబు తదితరులు ఆయన భౌతికకాయానికి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# తీర రక్షణకు 'గ్రేట్ గ్రీన్‌వాల్'

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేశారు? ఇప్పటి వరకు ఎన్ని మొక్కలు నాటారు? ఈ ఏడాది మడ అడవులను ఎంత విస్తీర్ణంలో పెంచనున్నారు? తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీబీజీ రామ్‌జీ పథకంలో భాగంగా తీర ప్రాంత జిల్లాలకు అదనంగా మరో 70 లక్షల మొక్కలు కేటాయించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇవి గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్య సాధనకు అదనపు బలం కానున్నాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, "వాతావరణ మార్పుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు తలెత్తాయి. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న తీర ప్రాంత జిల్లాలకు విపత్తుల ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి అసాధారణ వాతావరణ పరిస్థితుల నుంచి మన తీరాన్ని రక్షించుకోవడంలో గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషించనుంది. అందుకే కూటమి ప్రభుత్వం గ్రేట్ గ్రీన్ వాల్‌ను ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకువెళ్తోంది. రాష్ట్రంలో విస్తరించి ఉన్న 1,053 కి.మీ. తీర ప్రాంతం వెంబడి 5 కిలోమీటర్ల వెడల్పున పచ్చదనంతో కూడిన గోడను ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో ఈ ఏడాది 8,888 హెక్టార్లలో గ్రీన్ వాల్ విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. మొదటి అర్ధభాగంలో వాతావరణ అనుకూలతల ఆధారంగా కొంత మేర మొక్కలు నాటే ప్రక్రియ పూర్తైంది. ద్వితీయార్ధంలో తాటి విత్తనాలు అందుబాటులోకి రానున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వీటి సేకరణ, నాటే ప్రక్రియను పూర్తి చేయాలి. దాదాపు 5,000 హెక్టార్లలో తాటి వనాల ఏర్పాటును ఈ ఏడాది లక్ష్యంగా పెట్టుకున్నాం. కాలువ గట్లు, చెరువులు, తీర ప్రాంతాల్లో తాటి చెట్లు గాలి నిరోధక వ్యవస్థగా నిలుస్తాయి. తాటి వనాలు, సామాజిక వనాల ఏర్పాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి" అన్నారు.

**మడ అడవుల విస్తరణలో పురోగతి :** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గడచిన రెండేళ్లలో మడ అడవుల పెంపకంలో చక్కటి పురోగతి సాధించామని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 740 హెక్టార్లు, 2025-26లో 1,930 హెక్టార్ల మేర మడ అడవుల విస్తరణ చేపట్టామని పేర్కొన్నారు. తద్వారా మడ ఫారెస్టింగ్‌లో దేశంలోనే రెండో స్థానంలో నిలిచామని చెప్పారు. ఈ ఘనత సాధనకు కృషి చేసిన సిబ్బందికి, సహకరించిన పర్యావరణ నిపుణులను అభినందించారు. సాధారణంగా మడ అడవుల స్థాపనకు అక్టోబర్ నుంచి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని, ఈ ఏడాది మరింత బాధ్యతాయుతంగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో MISHTI-II కింద 305 హెక్టార్లలో మడ అడవుల పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. తీర ప్రాంత రక్షణ కవచమైన మడ అడవుల ప్రాధాన్యతను గుర్తించి నిర్ణీత సమయంలో విస్తరణ కార్యక్రమాలు పూర్తి చేయాలని ఆదేశించారు.



**జిల్లాల వారీగా లక్ష్యాలు :** గ్రేట్ గ్రీన్ వాల్ కార్యాచరణ ప్రణాళికల్లో భాగంగా ఈ ఏడాది 48 హెక్టార్లలో పరిహార అటవీకరణ చేపట్టామని, అది దాదాపు పూర్తయిందని తెలిపారు. అత్యధికంగా 5 వేల హెక్టార్లలో తాటి వనాలు నాటుతున్నామని పేర్కొన్నారు. గ్రీన్ క్లైమేట్ ఫండ్ కింద మరో 1,993 హెక్టార్లలో దేశీయ మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. 727 హెక్టార్లలో షెల్టర్ బెల్ట్ ప్లాంటేషన్లు లక్ష్యంగా నిర్దేశించామని చెప్పారు. మడ అడవులు, తాటి వనాలు మినహా మిగిలిన అటవీకరణ పనులను అంచెల వారీగా చేపట్టాలని ఆదేశించారు. తీర ప్రాంత పర్యావరణ వ్యవస్థలు, క్షీణించిన భూభాగాల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

వీబీజీ రామ్‌జీ ద్వారా తీర ప్రాంతం వెంబడి నాటేందుకు మరో 70 లక్షల మొక్కలు సిద్ధం చేస్తున్నామని, సుమారు 2,500 హెక్టార్లలో వాటిని నాటేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం సర్కిల్‌లో 3,243 హెక్టార్లు, గుంటూరు సర్కిల్‌లో 1,832 హెక్టార్లు, విశాఖ సర్కిల్‌లో 1,764 హెక్టార్లలో కలప ఉత్పత్తి, దేశీయ మొక్కల పెంపకాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

గ్రేట్ గ్రీన్ వాల్ కార్యక్రమం కింద 5 కిలోమీటర్ల వెడల్పుతో తీరానికి మూడంచెల రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొదటి రక్షణ వలయంలో మడ అడవుల పునరుద్ధరణ, షెల్టర్ బెల్ట్‌ల అభివృద్ధి, రెండో, మూడో వలయాల్లో గ్రామ వనాలు, సామాజిక వనాలు, వ్యవసాయ వనాల పెంపకాన్ని ప్రజలు, వివిధ శాఖల సమన్వయంతో చేపడుతున్నట్లు వివరించారు. స్థానిక పర్యావరణ పరిస్థితులు, వర్షపాతం, భౌగోళిక స్వభావాలను పరిగణనలోకి తీసుకుని అమలు చేయాలని సూచించారు. గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకువెళ్తోందని, ప్రాజెక్టు పురోగతిని నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఏపీ గ్రీనింగ్ అండ్ క్లైమేట్ చేంజ్ మిటిగేషన్ సొసైటీ ద్వారా గ్రీన్ వాల్ లక్ష్య సాధన దిశగా అన్ని శాఖలను సమన్వయం చేస్తున్నామని పేర్కొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

- రెండు నెలలుగా జీతాలు లేక 23 వేల మంది ఉద్యోగులు ఇబ్బందులు
- ప్రతి నెలా నిర్దిష్ట తేదీన వేతనాలు చెల్లించాలని టీఎన్‌యూఎస్ విజ్ఞప్తి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని 28 జిల్లాల్లో పనిచేస్తున్న సుమారు 23 వేల మంది సమగ్ర శిక్ష ఉద్యోగులకు గత రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.
సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న కేజీబీవీ సిబ్బంది, సీఆర్‌ఎంలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్‌పీలు, మెసెంజర్లు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు తదితర ఉద్యోగులు ప్రభుత్వ విద్యా వ్యవస్థలో కీలక సేవలు అందిస్తున్నప్పటికీ, వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జీతాలు లేక కుటుంబాల పోషణ, పిల్లల విద్య, వైద్య ఖర్చులు, రుణాల చెల్లింపులు భారంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు.
ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని టీఎన్‌యూఎస్ నాయకులు కోరారు. అలాగే భవిష్యత్తులో ప్రతి నెలా నిర్దిష్ట తేదీన వేతనాలు చెల్లించే విధానాన్ని అమలు చేసి ఉద్యోగులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రిటైర్డ్ ఉద్యోగుల అనుభవాలు అవసరం...




**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి ఏపీఎస్పీ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీఎస్పీ పెన్షనర్స్ సమావేశం జరిగింది. సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షులు తాటి కృష్ణారావు నాయుడు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఏపీఎస్పీ కమాండెంట్ ఏ మురళి హాజరయ్యారు. సమావేశంలో రిటైర్డ్ పెన్షనర్స్ తాము ఎదుర్కొంటున్న సమస్యలను కమాండెంట్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం కమాండెంట్ మురళి మాట్లాడారు. ఉద్యోగ విధి నిర్వహణలో ఉన్నప్పుడు అందరూ హీరోలే అని, రిటైర్డ్ అయిన తర్వాత ఎవరైనా సామాన్య వ్యక్తులుగా ఉంటారని, మీ సమస్యల పరిష్కారంకు తన వంతు సహకారం ఉంటుందన్నారు. రిటైర్డ్ అధికారులు, ఉద్యోగుల అనుభవాలు ఇప్పటి వారికి చాలా అవసరమన్నారు. బెటాలియన్ లో గ్రీవెన్స్ సెల్ లో ఒక నెంబర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆ నెంబరు మీ అసోసియేషన్ కు కూడా ఇస్తామని అది మీకు సహాయ పడుతుందనుకుంటున్నామన్నారు. ప్రతి ఏడాది అసోసియేషన్ ఫంక్షన్ ఏర్పాటు చేసి వెయ్యి మందికి పైగా భోజనాలు కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారని, అలాంటి వాటికి పెట్టే ఖర్చులు అసోసియేషన్ లో సభ్యుల వెల్ఫేర్ కు ఉపయోగించుకుంటే బాగుంటుందని ఆయన సూచించారు. నేడు వైద్య ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయని, మీరు కోరిన విధంగా గుండెకు సంబంధించిన వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించడం జరుగుతుందన్నారు. బెటాలియన్ లోకి పెన్షనర్స్ రావచ్చని వాకింగ్ వగైరా ఉపయోగించుకోవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు యూ పెద్ది రాజు, ప్రధాన కార్యదర్శి గుడిపాటి చిన్న తిరుపతి నాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎంఎస్కే శ్రీధర్, సహాయ కార్యదర్శి ఎన్ తుకారాం, కోశాధికారి శివ శంకర రెడ్డి, అసోసియేషన్ కో–ఆర్డినేటర్స్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు టీకే నాయుడు, నాయకులు, కమాండెంట్ మురళిని శాలువాతో సత్కరించారు.

# సీనియర్ పాత్రికేయుడు బడుగు భరత్ మృతి పట్ల ఎమ్మెల్యే తీవ్ర సంతాపం



**బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్ ):** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ సీనియర్ పాత్రికేయుడు బడుగు భరత్ తుది శ్వాస విడవడం అత్యంత బాధాకరమని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ఒక ప్రకటనలో తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. జనవాణిని, ప్రజల సమస్యలను నిష్పాక్షికంగా సమాజం ముందుకు తీసుకెళ్లడంలో భరత్ ఎంతో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న ఆయన అకాల మరణం బాపట్ల పత్రికారంగానికి, సమాజానికి తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. భరత్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే వర్మ రాజు భరోసా ఇచ్చారు.

# తల్లి పాల విశిష్టతపై అవగాహన



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** అంతర్జాతీయ తల్లి పాల వారోత్సవాల లో భాగం గా కాకుమాను మండలంలో ఐసీడీఎస్ కాకుమాను మండలం ఆధ్వర్యంలో ప్రజలకు తల్లి పాల యొక్క విశిష్టతను తెలియజేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో భాగంగా పెద్ది వారి పాలెం లో కార్య క్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్య క్రమం లో తల్లి పాల విశిష్టత గురించిన అవగాహన ఎ ఎన్ ఎం స్వప్న ఐసీడీఎస్ సూపర్వైజర్ వెంకాయమ్మ గర్భ వతులకు, బాలింత లకు, తల్లులు అవగాహన కల్పించారు.

# ఆయుష్ ఆసుపత్రికి స్థల పరిశీలన

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆయుష్ ఆసుపత్రి, అనుబంధ సంస్థలు ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సోమవారం స్థల పరిశీలన చేశారు. ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామ పరిధిలో స్థల పరిశీలన జరిగింది. గుంటూరు పట్టణానికి అతి సమీపంలో ఆయుష్ ఆసుపత్రి, అనుబంధ సంస్థలు రావడం వలన ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తహసిల్దార్ వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరంలో 28న మంత్రి సత్యకుమార్ 'మెగా జాబ్ మేళా'

- 90కిపైగా కంపెనీలతో ఉద్యోగ అవకాశాలు - పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి/ధర్మవరం (జర్నలిస్ట్ ఫైల్):** నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈనెల 28న శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంస్కృతి సేవా సంస్థ సహకారంతో ధర్మవరంలోని సీఎన్‌బీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న జాబ్ మేళా పోస్టర్‌ను సోమవారం అమరావతిలో ఆయన ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఉద్యోగాల కోసం యువత నగరాలు తిరగాల్సిన అవసరం లేకుండా ప్రముఖ దేశీయ, బహుళజాతి కంపెనీలనే ధర్మవరానికి తీసుకొస్తున్నామని చెప్పారు. ధర్మవరం నియోజకవర్గ యువతకు ఇది అరుదైన అవకాశమని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని యువత ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూలకు హాజరై ఉద్యోగాలు సాధించాలని సూచించారు.
జాబ్ మేళాలో 90కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని అక్కడికక్కడే ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి అర్హతలను బట్టి నెలకు రూ. 10 వేల నుంచి రూ. 50 వేల వరకు వేతనం లభించే అవకాశం ఉందన్నారు.
పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, డి.ఫార్మసీ, నర్సింగ్, ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ, యువకులు జాబ్ మేళాకు అర్హులని వివరించారు. అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.
ఆసక్తి ఉన్న అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యం పోర్టల్‌లో ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8688466361, 9390176421, 9966682246 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.
పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్, దినకర్ రెడ్డి, ఇమ్రాన్ సమాన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ డైరెక్టర్, సంస్కృతి సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రాచూరు అభివృద్ధిపై ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రత్యేక శ్రద్ధ

- '2 ఏళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం' ప్రచారంలో ప్రజలతో ముఖాముఖి
- గ్రామంలో రూ.87.77 లక్షల సంక్షేమ లబ్ధి అందిందని వెల్లడి





**భట్టిప్రోలు (జర్నలిస్ట్ ఫైల్):** భట్టిప్రోలు మండలం రాచూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన '2 ఏళ్ల నమ్మకం–అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్న ఆయన, గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం, మహిళా శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం–2, ఎన్టీఆర్ భరోసా, సూపర్ సిక్స్ తదితర సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేశారు. ప్రజల సమస్యలు, సూచనలను తెలుసుకుని మైటీడీపీ యాప్ ద్వారా నమోదు చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇదే తరహా కార్యక్రమాన్ని నిర్వహించాలని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సీయూబీ ఇన్‌ఛార్జులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా రాచూరు గ్రామానికి ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఎమ్మెల్యే వెల్లడించారు. 1,187 జనాభా, 460 కుటుంబాలు ఉన్న గ్రామంలో తల్లికి వందనం, దీపం–2, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా, గృహ నిర్మాణం, మహిళా శక్తి, పీఎం కిసాన్, ఎన్టీఆర్ వైద్య సేవ, స్కాలర్‌షిప్‌లు తదితర పథకాల ద్వారా మొత్తం రూ. 87.77 లక్షల విలువైన లబ్ధి అందిందన్నారు. అలాగే రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించడంతో పాటు తాగునీటి అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. అవసరమైన 26 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 30.62 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు.
ప్రజల సంక్షేమం, గ్రామాల సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. 'స్వర్ణాంధ్ర–విజన్ 2047' లక్ష్యంతో భారీ పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల కల్పన, పోలవరం, అమరావతి అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. రాచూరు గ్రామానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, సీయూబీ ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బీజేపీని ఒక్క ఉపఎన్నికతో తక్కువ అంచనా వేయడం అవివేకం

- బాంకీపూర్ ఉపఎన్నికపై అతిశయోక్తి వ్యాఖ్యలు తగవు
- ఒక ఉపఎన్నికతో బీజేపీ బలం తగ్గిందని చెప్పడం సరికాదు
- ఆంధ్రప్రదేశ్ బీజేపీ మీడియా ఇన్‌చార్జి డా. దిలీప్ కిలారు



**అమరావతి, ఆగస్టు 3 (జర్నలిస్ట్ ఫైల్):** బీహార్‌లోని బాంకీపూర్ ఉపఎన్నిక ఫలితాన్ని ఆధారంగా చేసుకుని బీజేపీ మూడు దశాబ్దాల రాజకీయ కోట కూలిపోయిందని ప్రచారం చేయడం వాస్తవాలకు దూరమని ఆంధ్రప్రదేశ్ బీజేపీ మీడియా ఇన్‌చార్జి డా. దిలీప్ కిలారు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.
ప్రశాంత్ కిశోర్ ప్రజాస్వామ్యబద్ధంగా విజయం సాధించినందుకు అభినందనలు తెలియజేస్తూనే, ఒక్క ఉపఎన్నిక ఫలితంతో బీజేపీ రాజకీయ బలం తగ్గిందని తేల్చడం తొందరపాటు నిర్ణయమని అన్నారు. బాంకీపూర్ నియోజకవర్గానికి దాదాపు రెండు దశాబ్దాల పాటు ప్రాతినిధ్యం వహించిన నితిన్ నబిన్ ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించారని, ఆ రాజకీయ వారసత్వాన్ని ఒక్క ఉపఎన్నికతో కొలవడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికలో అసలు రాజకీయ పరీక్ష బీజేపీకి కాదని, ప్రశాంత్ కిశోర్‌కేనని దిలీప్ కిలారు అభిప్రాయపడ్డారు. దశాబ్దకాలంగా ఎన్నికల వ్యూహకర్తగా, "కింగ్‌మేకర్"గా పేరుపొందిన ప్రశాంత్ కిశోర్ ఇప్పుడు స్వయంగా ప్రజల తీర్పును ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. 2025 అక్టోబర్‌లో బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని, పార్టీ నిర్మాణంపైనే దృష్టి పెడతానని ప్రశాంత్ కిశోర్ ప్రకటించారని గుర్తుచేశారు. అయితే ఏడాది తిరగకముందే బాంకీపూర్ ఉపఎన్నికలో పోటీ చేయడం సహజంగానే ప్రజల్లో ప్రశ్నలు రేకెత్తిస్తోందని అన్నారు. రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు మార్చుకోవడం ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, ఆ మార్పుకు కారణాలపై ప్రజలకు ప్రశ్నించే హక్కు ఉందని పేర్కొన్నారు.
ఒక అసెంబ్లీ స్థానంలో విజయం ప్రశాంత్ కిశోర్‌కు రాజకీయంగా కీలక ఘట్టమే అయినప్పటికీ, దానిని బీజేపీ వైఫల్యంగా చిత్రీకరించడం సమంజసం కాదని దిలీప్ కిలారు స్పష్టం చేశారు. సిద్ధాంతం, నాయకత్వం, లక్షలాది మంది కార్యకర్తల కృషితో నిర్మితమైన జాతీయ పార్టీ బీజేపీ బలం ఒక్క ఉపఎన్నిక ఫలితంతో నిర్ణయించబడదని అన్నారు.
ఈ ఫలితం ద్వారా ఇప్పుడు ప్రధాన చర్చ ప్రశాంత్ కిశోర్ రాజకీయ భవిష్యత్తుపైనే కేంద్రీకృతమైందని, ఇతరులను గెలిపించిన "కింగ్‌మేకర్"గా పేరొందిన ఆయన స్వయంగా ఎంతటి రాజకీయ శక్తిగా ఎదుగుతారన్నదే ముందున్న అసలు పరీక్ష అని దిలీప్ కిలారు పేర్కొన్నారు.

# అక్రమంగా నిల్వ చేసిన యూరియా ఎరువులపై సమగ్ర విచారణ జరిపి లైసెన్స్ రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న మండల వ్యవసాయ అధికారిపై చర్యలు తీసుకోవాలి
- జిల్లా అధికారుల నామమాత్రపు విచారణపై అనుమానాలు వ్యక్తం చేసిన సిపిఐ మండల కార్యదర్శి పెద్దల్లపల్లి ప్రభాకర్



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో ఎలాంటి చట్టబద్ధమైన అనుమతి పత్రాలు లేకుండా సుమారు 3000 బస్తాల యూరియా మరియు ఇతర రసాయన ఎరువులను అక్రమంగా నిల్వ చేసిన ఘటన అత్యంత ఆందోళనకరమని సిపిఐ బ్రహ్మంగారిమఠం మండల కార్యదర్శి పెద్దల్లపల్లి ప్రభాకర్ పేర్కొన్నారు.
వ్యవసాయానికి అత్యంత కీలకమైన యూరియా ఎరువులను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేయడం రైతుల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించే చర్య అని ఆయన అన్నారు. ఇలాంటి అక్రమ నిల్వల వల్ల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే అవకాశం ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.
ఈ ఘటనపై జిల్లా అధికారులు కేవలం నామమాత్రపు విచారణ నిర్వహించి చేతులు దులుపుకోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించకుండా వ్యవహరించడం వల్ల అక్రమాలకు పాల్పడిన వారిని కాపాడే ప్రయత్నం జరుగుతోందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఎలాంటి లైసెన్సులు, నిల్వ అనుమతులు లేకుండా వేల బస్తాల ఎరువులు ఎలా నిల్వ చేశారో వాటి కొనుగోలు బిల్లులు, రవాణా పత్రాలు గోదాం అనుమతులు, స్టాక్ రిజిస్టర్లు సంబంధిత రికార్డులన్నింటినీ స్వాధీనం చేసుకుని సమగ్రంగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.
ఈ వ్యవహారంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి, అక్రమాలను అడ్డుకోకుండా చూసి చూడనట్లు వ్యవహరించిన మండల వ్యవసాయ అధికారి (ఏవో) పాత్రపై కూడా శాఖాపరమైన విచారణ జరిపి తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే అక్రమ నిల్వలకు పాల్పడిన వ్యక్తులపై లైసెన్స్ రద్దు, సంబంధిత చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు, అక్రమంగా నిల్వ చేసిన యూరియా, ఎరువులను స్వాధీనం చేసుకోవడం, ఈ వ్యవహారంలో భాగమైన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.
రైతుల ప్రయోజనాలను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైతే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే సిపిఐ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను చేపడతామని పెద్దల్లపల్లి ప్రభాకర్ హెచ్చరించారు.
**డిమాండ్లు:** బ్రహ్మంగారిమఠం మండలంలో అక్రమంగా నిల్వ చేసిన 3,000 బస్తాల యూరియా, ఎరువులపై సమగ్ర విచారణ జరపాలి.
అక్రమ నిల్వలకు పాల్పడిన వారి లైసెన్సులను వెంటనే రద్దు చేయాలి.
బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.
విధి నిర్వహణలో విఫలమైన మండల వ్యవసాయ అధికారి (ఏవో)పై శాఖాపరమైన చర్యలు చేపట్టాలి.
విచారణ నివేదికను బహిరంగపరచి రైతులకు న్యాయం చేయాలి.


# జీర్ణకోశ మహమ్మారి పై 'యశోద' ఆధునిక అస్త్రం!




- యశోద హాస్పిటల్స్ లో రోబోటిక్ సర్జరీలతో మెరుగైన క్యాన్సర్ చికిత్సలు
- ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి నూరు శాతం విముక్తి
- మారుతున్న జీవనశైలి, చెడు వ్యసనాలతోనే పొంచి ఉన్న గ్యాస్ట్రో ముప్పు
- విలేకరుల సమావేశంలో ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ శ్రీపతి వెల్లడి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** మారుతున్న జీవనశైలి, ఆధునిక ఆహారపు అలవాట్లు మానవ శరీరంలోని అత్యంత కీలకమైన జీర్ణకోశ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ట్రో సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ల బారి నుంచి రోగులను కాపాడేందుకు ఆధునిక వైద్య సాంకేతికత సంజీవనిలా మారుతోందని యశోద హాస్పిటల్స్ ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ శ్రీపతి స్పష్టం చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జీర్ణకోశ వ్యాధులపై సమగ్ర సమాచారాన్ని పంచుకున్నారు. అత్యంత సంక్లిష్టమైన గ్యాస్ట్రో శస్త్రచికిత్సలను అలవోకగా ఛేదించి వేలాది మంది రోగులకు పునర్జన్మ ప్రసాదించిన డాక్టర్ వెంకటేష్ శ్రీపతి, తన అపార అనుభవంతో జాతీయ స్థాయిలో అగ్రగామి సర్జన్‌గా విశేష గుర్తింపు పొందారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగికైనా అత్యాధునిక పద్ధతుల్లో చికిత్స అందించి ప్రాణాలు నిలపడంలో ఆయనది అందెవేసిన చేయి. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో సరైన వేళకు ఆహారం తీసుకోకపోవడం, ధూమపానం, మద్యపానం, ఊబకాయం, మధుమేహం తదితర కారణాల వల్ల కాలేయం, ప్యాంక్రియాస్, అన్నవాహిక, జీర్ణాశయం, పెద్దపేగు తదితర అవయవాలు తీవ్ర వ్యాధుల బారిన పడుతున్నాయని డాక్టర్ వెంకటేష్ శ్రీపతి ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కడుపులో నొప్పి, ఆహారం మింగేటప్పుడు ఇబ్బందిగా అనిపించడం, ఆకలి మందగించడం, అకారణంగా బరువు తగ్గడం, మలంలో రక్తం పడటం వంటి లక్షణాలను సాధారణ సమస్యలుగా భావించి ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. ఈ తరహా లక్షణాలు కనిపించిన వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవడం ద్వారా పెను ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని హితవు పలికారు. క్లిష్టమైన గ్యాస్ట్రో సమస్యలు, క్యాన్సర్లకు యశోద హాస్పిటల్స్ వేదికగా ఎండోస్కోపీ, కొలోనోస్కోపీ, ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్, ఈఆర్సీపీ, లాపరోస్కోపిక్, రోబోటిక్ శస్త్రచికిత్సల ద్వారా అత్యుత్తమ వైద్యాన్ని అందిస్తున్నట్లు డాక్టర్ వెంకటేష్ వెల్లడించారు. ముఖ్యంగా గ్యాస్ట్రో క్యాన్సర్ల చికిత్సలో మాగ్నెటిక్ రెసోనెన్స్ లీనియర్ యాక్సిలరేటర్ (ఎంఆర్ లినక్) సాంకేతికత విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని వివరించారు. ఈ అత్యాధునిక విధానంలో ప్రతిరోజూ ఎంఆర్ఐ చిత్రాల ఆధారంగా కాలేయం, ప్యాంక్రియాస్, అన్నవాహిక, రెక్టమ్ ప్రాంతాల్లోని క్యాన్సర్ కణితులను కచ్చితత్వంతో గుర్తించి రేడియేషన్ అందిస్తారని, దీనివల్ల చుట్టుపక్కల ఉండే ఆరోగ్యకరమైన కణాలకు ఎలాంటి నష్టం వాటిల్లదని స్పష్టం చేశారు. దుష్ప్రభావాలు లేని ఈ విధానం ద్వారా క్యాన్సర్ చికిత్సలో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, 24 గంటల అత్యవసర సేవలు, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విభాగాలతో పాటు సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ నిపుణుల సమన్వయంతో ఒకే గొడుగు కింద రోగ నిర్ధారణ నుంచి శస్త్రచికిత్స, కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, పునరావాసం వరకు సమగ్ర వైద్య సేవలు అందించడం యశోద హాస్పిటల్స్ సొంతమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ హెడ్ వీరంకి వెంకటేశ్వరరావు, గుంటూరు ఏరియా అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ తిమోతి తదితరులు పాల్గొన్నారు.

# నేడు శాఖంబరి అలంకరణలో వాసవి అమ్మవారు



**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు ఈరోజు వాసవి అమ్మవారు శాకంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు అమ్మవారి శాల అధ్యక్షులు అయ్యప్ప వెంకట సురేష్ బాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠం లోని భక్తులు ప్రతి ఒక్కరూ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొంది అన్న ప్రసాదం స్వీకరించి వెళ్లాలని మహిళలను భక్తులను కోరారు. అమ్మవారి సేవలో అత్యధికంగా మహిళలు పాత్రులు అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుంకు సురేష్ కోశాధికారి వెంకటేశ్వర్లు యువజన సంఘం అధ్యక్షులు వెంకటసుబ్బయ్య కమిటీ సభ్యులు ముచ్చర్ల శేషయ్య పబ్బతి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ శాకాంబరీ దేవి అలంకరణ మహోత్సవమునకు బన్నూరు కృష్ణమూర్తి మరియు వారి కుటుంబ సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు

# బీజేపీ జిల్లా ఓబిసి కార్యదర్శిగా రమేష్ ఎన్నిక



**నల్లబెల్లి ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శిగా వల్లే రమేష్ యాదవ్ ఎన్నికైనట్లు వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు గంటా రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. నల్లబెల్లి మండలం నాగరాజు పల్లె గ్రామ శివారు వల్లె నర్సయ్య పల్లె కు చెందిన వల్లే రమేష్ యాదవ్ ను జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో కీలక బాధ్యతలను అప్పగించిన పార్టీ అధిష్టానానికి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రారావు, జిల్లా అధ్యక్షులు రవికుమార్, ఓబీసీ జిల్లా మోర్చా అధ్యక్షులు క్రాంతికుమార్, నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే పుల్లారావు లకు కృతజ్ఞతలు తెలిపారు.

## సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేద్దాం

- టిఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ డా. బోడ అనిల్ కుమార్ నాయక్



**నర్సంపేట ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ ఈనెల ఆరవ తేదీ మధ్యాహ్నం 12:00 గంటలకు హైదరాబాదులోని సరూర్‌నగర్ స్టేడియం నిర్వహించడం జరుగుతుంద ని మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలో నర్సంపేట నియోజకవర్గం పరిధిలో ఉండే యువత యువ నాయకులు కార్యకర్తలు మహిళా నాయకులు ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సమితి మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ బోడ అనిల్ నాయక్ పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం కోసం.. సమాన అవకాశాల కోసం.. బీసీల సాధికారత కోసం.. మనమందరం పెద్ద ఎత్తున తరలి వెల్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకువచ్చే విధంగా సభను విజయవంతం చేయవలసిందిగా నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు అరుణ్, సందీప్, జాఫర్, రాజు, నర్సయ్య, రమేష్, సుధాకర్ రాజేష్, తులసిరం పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు..



**దేవరకద్ర ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** కొత్తకోట మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పి.కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా పల్లెపగా ప్రశాంత్ మాట్లాడుతూ పి.కృష్ణారెడ్డి సమస్యల్లో ఉన్నవారిని గుర్తించి సహాయం అందించడం, విద్య, వైద్యం, మరియు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం,మహిళలు, పిల్లలు మరియు అట్టడుగు వర్గాల హక్కుల కోసం పోరాటం చేయడం, లాంటి ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తూ సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించారన్నారు. కృష్ణారెడ్డి ప్రకృతి విపత్తులు లేదా అత్యవసర సమయాల్లో సహాయక చర్యలు చేపట్టడం, ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడడం,ప్రజా ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య శిబిరాల నిర్వహణ, రక్తదానం కార్యక్రమాలు నిర్వహించారు. సమాజ సేవతోపాటు పార్టీకి అదేస్థాయిలో సమయం ఇస్తూ అహర్నిశలు పార్టీ అభ్యున్నతికి కృషిచేస్తున్న కృష్ణారెడ్డి ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని రాజకీయాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కొనియాడారు. కృష్ణారెడ్డి జన్మదినం సంధర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు,బ్రెడ్డు ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో కొత్తకోట మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి రోడ్డుపైకి జిల్లా ఎస్పీ.. ఆకస్మిక వాహన తనిఖీలు

- నిబంధనలు ఉల్లంఘించిన కారును సీజ్
- తనిఖీలు నిర్వహించిన ఎస్పీ టి.శ్రీనివాసరావు



**గద్వాల, ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** జోగులాంబ గద్వాల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు జిల్లా పోలీసు శాఖ అర్ధరాత్రి ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించింది. జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు శనివారం అర్ధరాత్రి స్వయంగా రంగంలోకి దిగి జమ్మిచేడు చౌరస్తా, పిల్లిగుండ్ల చౌరస్తాల్లో ఆకస్మిక ర్యాండమ్ వెహికల్ చెకింగ్‌ను పర్యవేక్షించారు. రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా జరిగే రవాణాను అరికట్టేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఎస్పీ స్వయంగా తనిఖీల్లో పాల్గొని పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో ఒక ఆర్ఐ, ఒక ఆర్ఎస్ఐతో పాటు 10 మంది పోలీసు సిబ్బంది ప్రత్యేక బృందంగా విధులు నిర్వహించారు. వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ తదితర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలకు నెంబర్ ప్లేట్లు ఉన్నాయా లేదా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తూ రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తనిఖీల్లో నెంబర్ ప్లేట్ లేకుండా ప్రయాణిస్తున్న ఒక కారును గుర్తించిన పోలీసులు దానిని గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజల భద్రతే పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. జిల్లాలో నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల అరికట్టేందుకు రాత్రింబవళ్లు ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఆకస్మిక వాహన తనిఖీలు నిరంతరం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అలాగే ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ వంటి వాహన సంబంధిత ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని, నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర స్థాయి క్రీడలకు కనగర్తి విద్యార్థులు



**ఓదెల, ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్‌టీపీసీ జ్యోతినగర్‌లో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కనగర్తి దాసరి పద్మ హన్మయ్య జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. జావెలిన్ త్రోలో దుర్గాప్రసాద్, అక్షయ్ కార్తి బంగారు పతకాలు సాధించగా, సిద్ధి వినాయక్, మహీదా, రోషన్ రజతాలు, చరణ్, జయశ్రీ కాంస్య పతకాలు గెలుచుకున్నారు. శివమణి సైతం ప్రతిభ చూపారు. వీరు ఈ నెల 7న హన్మకొండ జేఎన్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులను ఎంఈఓ వై.రమేష్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

# ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవాన నిరసన కార్యక్రమం చేబడుతాం

- ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)



**వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిరసన కార్యక్రమాలు చేపడతామని, ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పేర్కొన్నారు. ఆదివారం ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆదివాసి సంఘాల నాయకులు హాజరై ముక్తకంఠంతో ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని బ్లాక్ డేగా నిర్వహించాలని తీర్మానం చేయడం జరిగింది. సమావేశంలో తుడుం దెబ్బ జాతీయ నాయకులు యాసం రాజు, గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి, ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోర్స నర్సింహమూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంత చట్టాలు అమలు విషయంలో సవతి తల్లి ప్రేమ కనబరుస్తున్నారని,1/70 చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా అడ్డుపడుతున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంతాలకు వలసలుగా గిరిజనేతరులు వస్తూ ఏజెన్సీ చట్టాలను తొలగించాలని,1700 మంది గిరిజనేతరులు కోర్టుని ఆశ్రయించడం అందులో ప్రధాన పాత్రలో వెంకటాపురం మండలానికి చెందిన అధికార పార్టీ వ్యక్తి ఉండడం విడ్డూరం అని అన్నారు.

మా ప్రాంతానికి వచ్చి మా ప్రాంత చట్టాలను తొలగించాలని ఎలా అడుగుతారని, తల్లి పాలు తాగి రొమ్మును తన్నినట్టుగా ఉందన్నారు.

దీనికి అధికారి పార్టీలో ఉన్న ఆదివాసి ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో వ్యతిరేకించాలని, ఏజెన్సీ ప్రాంతా రిజర్వేషన్లు కూని చేసే విధంగా ఉందని, రేపు ఆదివాసి ప్రజా ప్రతినిధులకు రాజకీయ భవిష్యత్తు ఉండదని తెలిపారు. 3 జీవోను కూడా పునరుద్దరించి షెడ్యూల్ ఏరియాలో 100శాతం రిజర్వేషన్ అడివాసికే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఆగస్టు 9న జరగబోయే ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి ఆదివాసి యువతీ, యువకులు, ఆదివాసి సంఘాలు, ఆదివాసి ఉద్యోగ సంఘాలు, ఆదివాసి మహిళా సంఘాలు, ఆదివాసి పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై భారీ ఎత్తున నిరసన కార్యక్రమం ప్రదర్శించాలని ఈ సందర్భంగా కోరారు.

ఈ కార్యక్రమంలో జీవీస్పీ జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్, ఏఎన్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కుంజ మహేష్, తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు చింత సోమరాజు, సిద్దబోయిన సర్వేశ్వరరావు, బిక్షపతి, కనితి విజయ్, మండల నాయకులు కనితి వెంకటకృష్ణ, తురస చంటి, తెలంగాణ ఆదివాసి భూమిపుత్ర సంఘం నాయకులు ఉండం ప్రసాద్, పాల్గొన్నారు.

## ఎన్నికల హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

- వీర్లపల్లి గ్రామ ప్రజలకు త్వరలో ఫ్లాట్లు



**కల్వకుర్తి ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ శనివారంన గుండా క్యాంపు కార్యాలయంలో వీర్లపల్లి గ్రామ ప్రజలతో సమావేశమయ్యారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన పునరావాస హామీని తప్పకుండా నెరవేర్చనున్నట్లు ఎమ్మెల్యే అన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ ప్రభావంతో వీర్లపల్లి గ్రామ ప్రజలు దాదాపు ఎన్నో సంవత్సరాలుగా విపరీతంగా కష్టాలనుభవిస్తున్నప్పటినుండి కేంద్రం, ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం గ్రామానికి పునరావాసం కల్పించడంలో తగిన చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీనివల్ల గ్రామ ప్రజలకు శాశ్వత పరిష్కారం అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో ప్రభుత్వ నేతలతో చర్చలు జరిపించానని ఆయనే తెలిపారు.జిల్లా కలెక్టర్‌తో పలు సందర్భాల్లో సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు, వీర్లపల్లిలోని 250కు పైగా కుటుంబాల కోసం ఫ్లాట్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ఆమోదించిందని రాజ్ ఠాకూర్ వెల్లడించారు. ఫ్లాట్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను ఇప్పటికే పరిశీలించి ముందస్తు చర్యలు ప్రారంభించినట్లు, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ (ఇందిరా) గృహాల నిర్మాణ ప్రక్రియ త్వరలోనే ప్రారంభించి ఫ్లాట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామగుండం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. 21వ డివిజన్ కార్పొరేటర్ కందుల స్వరూప సతీష్, జిల్లా కాంగ్రెస్ డివిజన్ ఇంచార్జ్ కొక్కిరాల శ్రీనివాస్ తదితరులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. వీర్లపల్లి గ్రామ ప్రజలు ఎన్నేళ్ళుగా ఎదురుచూస్తున్న పునరావాస సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు అపార సానుకూల స్పందన వ్యక్తం చేశారు.

### రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ

## యువజన విభాగ ప్రమాణ స్వీకార మహోత్సవం

- ఆర్యవైశ్య రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రెటరీగా చిదురాల వేణుగోపాల్



**పర్వతగిరి, ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అన్ని విభాగాల అధ్యక్ష కార్యదర్శుల కోశాధికారుల నియామకంతో పాటు కార్యనిర్వాహక వర్గాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగ మెంబర్ల ప్రమాణ స్వీకార మహోత్సవం హైదరాబాద్ లకిడికపూల్ నందు గల ఆర్యవైశ్య కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. ఇందులో వరంగల్ జిల్లాకు చెందిన 8 మందికి వివిధ విభాగాల్లో ప్రమాణ స్వీకారం చేశారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రం నుండి రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రెటరీగా చిదురాల వేణుగోపాల్ ను నియమించారు. వీరితోపాటు జిల్లా నుండి గార్లపాటి సంతోష్ కుమార్, సుద్దాల రమేష్, మల్యాల వినయ్ కుమార్, జూలూరి వినయ్ కుమార్, నాగవల్లి సుమన్ తదితరులు నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని అందించిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు దుబ్బ శ్రీనివాస్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో జిల్లాలోనూ రాష్ట్రస్థాయిలోనే యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ముందుంటామని తెలియజేశారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులను వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు అయినవోలు డైరెక్టర్ దారంపూర్ణ చందర్ అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ లీగల్ సెల్ ప్రతినిధులు తాటికొండ కృష్ణమూర్తి సభ్యులందరికీ శాలువాతో సన్మానించి సత్కరించారు.

## కరాటే పోటీల్లో నర్సంపేట విద్యార్థుల సత్తా



**నర్సంపేట ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మంలో జరిగిన సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో నర్సంపేట విద్యార్థుల సత్తా 3 బంగారు, 1 వెండి, 2 కాంస్య పతకాలతో నర్సంపేట విద్యార్థుల ఘనత..ప్రపంచ ఫునాకోషి షోటోకాన్ కరాటే ఆర్గనైజేషన్ అనుబంధంతో, మహబూబ్ కరాటే స్పోర్ట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ 2026 జాతీయస్థాయి కరాటే పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీలకు దక్షిణ భారతదేశంలోని పలు రాష్ట్రాల నుంచి దాదాపు 2000 మంది కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. వరంగల్ జిల్లా, నర్సంపేట మండలం జి ఎస్ కే డి అంగడి గ్రౌండ్స్ ఈవినింగ్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు శిక్షకులు. జానీ మాస్టర్, మహేష్ మాస్టర్, శ్రీనాథ్ మాస్టర్ శిక్షణలో పలు విభాగాల్లో పాల్గొని అత్యంత ప్రతిభను కనబరిచి పతకాలు సాధించారు. **నర్సంపేట విద్యార్థులు సాధించిన పతకాలు:** బంగారు పతకాలు – (గోల్డ్), 1. శ్రీలితిక– 9 సంవత్సరాల బాలికల విభాగం, 2.. నిహాంత్ పటేల్ 9 సంవత్సరాల బాలుర విభాగం, 3. చక్రాద్రి చారి 9 సంవత్సరాల బాలుర విభాగం వెండి పతకం (సిల్వర్), 1.. విరాట్ సాయి, కాంస్య పతకాలు (బంజే), 1 సిద్దు 2 చాణిక్య యాదవ్ గెలుపొందిన విద్యార్థులను శిక్షకులు ఎస్.కె . జానీ మాస్టర్ని జి ఎస్ కే డి గ్రాండ్ మాస్టర్ వెంకటేశం మాస్టర్, నర్సంపేట మదర్స్ ల్యాండ్ హై స్కూల్ చైర్మన్ రమేష్ నర్సంపేట చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ అమర్నాథ్ విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.నర్సంపేట పేరును జాతీయస్థాయిలో నిలబెట్టిన విద్యార్థులకు మరియు శిక్షకులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

### ఎవరి కోసం, ఎవరి స్వార్థం కోసం

## హైడ్రాను రద్దు చేయాలి..

- ఎవరి ఇల్లుని కూలగొట్టడానికి హైడ్రా రాలేదు...
- ప్రభుత్వ స్థలాలను అక్రమార్కుల చెర నుండి విడిపించేదే హైడ్రా..
- ప్రభుత్వ ఆస్తులను ఆక్రమణ గురికాకుండా చూస్తుంది హైడ్రా
- కబ్జాదారులకు మాత్రం శిక్ష తప్పదు..



**దేవరకద్ర ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** హైడ్రా ను రద్దు చేయాలని డిమాండ్ చేసే ముందు, అది ఎందుకు తీసుకొచ్చారో ముందుగా నిష్పాక్షికంగా విశ్లేషించు కోవాలి. ఏ భూములను ఆక్రమణల నుంచి విముక్తి చేశారు, ఏ అక్రమ నిర్మాణాలను కూల్చి వేశారు, అలాగే ఆ అపార్ట్‌మెంట్‌లు లేదా భవనాలు నిర్మించేందుకు బిల్డర్లకు అనుమతులు ఎవరు ఇచ్చారు, అనే విషయాలు ముందుగా భారస, బీజేపీ పార్టీ వాళ్ళు స్పష్టంగా తెలుసుకోవాలి. ఈ విషయాలన్నీ తెలుసుకున్న తర్వాతే హైడ్రా అవసరమా కాదా అనే అంశంపై చర్చించడం సమంజసం. ఒక్కసారి నగరంలోని చెరువులను సందర్శించండి. ఇప్పుడు అవి ఎంత అందంగా మారాయో వాటి పరిసరాల్లో నివసిస్తున్న హైదరాబాద్ ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారో మీకే తెలుస్తుంది. ఈ మార్పుకు హైడ్రా చేపట్టిన చర్యలు కూడా ఒక ముఖ్యమైన కారణం. ప్రజలకు నిజంగా ఉపయోగపడే అంశాలపై పూర్తి వాస్తవాలు తెలుసుకోకుండా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు విమర్శించడం సరైంది కాదు. భవిష్యత్తులో అక్రమ ఆక్రమణలు, అనధికార నిర్మాణాలను అరికట్టడంలో హైడ్రా ఉపయోగపడుతుంది అది సమాజానికి మొత్తం మేలు చేసే విషయమే అని జిమ్మేర్ పేర్కొన్నారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిపిఐ ఉద్యమం



**నల్లబెల్లి ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యా, వైద్యం, విద్యుత్ రంగాల ప్రైవేటీకరణ, రైతు పంటలు కొనుగోలుపై 35 శాతం పరిమితి, ఉపాధిహామీ పథకంపై ఆంక్షలు, అధికధరలపై సిపిఐ పార్టీ దేశవ్యాప్తంగా పాద యాత్రలు, ప్రజల సంతకాల సేకరణ వంటి ఉద్యమాన్ని సిపిఐ పార్టీ చేపట్టనుందని సిపిఐ వరంగల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి అన్నారు. కొనకటి రమేష్ అధ్యక్షతన మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కొనకటి రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నేడు అన్ని రంగాలను ప్రైవేటుపరం చేస్తూ అధిక ధరలు పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజల బతుకులను ఛిద్రం చేస్తున్నదన్నారు. విద్యా, వైద్యం ప్రైవేటీకరణ మూలంగా పేద మధ్యతరగతి ప్రజలు చదువును, ఆరోగ్యాన్ని కొనలేక పోతున్నారన్నారు. అడ్మిషన్లు, డొనేషన్లు కోచింగ్ ల పేరుతో ప్రైవేటు విద్యా సంస్థలు లక్షలాది రూపాయలను ప్రజలనుంచి గుంజుతుండటం ఒకవైపు, ప్రశ్నాపత్రాలు లీకులు మరోవైపు, లక్షలాది ప్రభుత్వ పోస్టులున్నా భర్తీ చేయకపోవడంతో ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. వ్యవసాయ రంగాన్ని దివాళా తీసే విధంగా కల్తీ విత్తనాలు ఎరువులు, పురుగు మందులకు తోడు మార్కెట్ సౌకర్యాలు లేకా, పంటలు కొనుగోలు చేయకపోవడంతో పాటు 35 శాతం మించి పంటలను కొనుగోలు చేయమంటూనే, అమెరికా ట్రేడ్ డీల్ తో స్వదేశీ రైతాంగాన్ని నట్టేట ముంచే విధానాలు చేపట్టడంతో రైతాంగం దివాళతీస్తారన్నారు. వ్యవసాయకూలీలకు ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి రాష్ట్రాలపై 40శాతం భారం మోపడంతో రాష్ట్రాలపై అధిక భారాలు పడీ రాష్ట్రాల వాటా జమ చేయకపోతే కేంద్రం ఇచ్చే 60 శాతం నిధులు కూడా నిలాపేస్తామనడం ద్వారా ఉపాధి హామీ పథకం నిర్వీర్యం అవుతుందన్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా ఆగస్టు 4 నుంచి 10 వరకు ప్రజల దగ్గరకు సిపిఐ వెళుతుందన్నారు. అనంతరం మండల కార్యదర్శి బట్టు సాంబయ్యను వ్యక్తిగత కారణాలతో కార్యదర్శి పదవి నుంచి తొలగించి, నూతన మండల కార్యదర్శిగా పరికి కోర్నేలును, సహాయ కార్యదర్శులుగా కడియాల క్రాంతి కుమార్, మామిండ్ల పెద్ద ఐలయ్య లను ఎన్నిక చేసినట్టు కుమారస్వామి తెలిపారు. ఈ సమావేశంలో మద్రి రమేష్, అనుమాండ్ల కొంరెల్లి, రవి తదితరులు పాల్గొన్నారు.

## హిందూ గోరక్ష సేవ స్ఫూర్తి ఎందరికో ఆదర్శం

- రోడ్లపై ఉన్న పశువులకు లైటింగ్ బెల్టులను కట్టిన గోరక్షకులు



**నర్సంపేట ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** రాత్రి వేళల్లో రోడ్లపై స్వేచ్ఛగా తిరిగే గోవులు వాహనదారులకు కనిపించక ప్రమాదాలకు కారణమవుతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్యకు వినూత్న పరిష్కారంగా గోవులకు రిఫ్లెక్టివ్ లైటింగ్ బెల్టు ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి సమయంలో వీధుల్లో తిరిగే గోవులు వాహనదారులకు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.ఈ ప్రమాదాలను నివారించేందుకు నర్సంపేట హిందు గోరక్ష సేవకులు ముందుకొచ్చి గోవుల మెడలకు ప్రత్యేక రిఫ్లెక్టివ్ లైటింగ్ బెల్టను అమర్చుతున్నారు. వాహనాల హెడ్‌లైట్ పడగానే ఈ బెల్టు ప్రకాశించి దూరం నుంచే గోవులు స్పష్టంగా కనిపిస్తాయి దీంతో డ్రైవర్లు అప్రమత్తమై వేగాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని గో రక్ష కమిటీ సభ్యులు తెలుపుతున్నారు.ఈ చిన్న ప్రయత్నం మూగజీవాల ప్రాణాలను కాపాడటంతో పాటు, రోడ్డు ప్రమాదాలను కూడా తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

సామాజిక బాధ్యతతో గత 5సంవత్సరాల నుండి చేపట్టిన గోరక్ష కార్యక్రమాలపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని ప్రాంతాల్లో కూడా అమలు చేయాలని కోరుతున్నారు.ఈ సందర్భంగా కొంపెల్లి రాజు హిందు గోరక్షక్ నిర్వహకులు మాట్లాడుతూ, రోడ్లపై తిరుగుతున్న గోవులపై ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు తక్షణమే గోవుల యజమానులకు సమాచారం అందించి గోవులు రోడ్లపై సంచరించకుండా చర్యలు తీ సుకోగలరు లేని యెడల మీ ఆధ్వర్యం లో స్థానిక గోశాలలకు తరలించి వాటి ప్రాణాలను కాపాడగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో హిందూ గో రక్షక్ నిర్వాహకులు కొంపెల్లి రాజు, కము లేష్, వెంగళ సురేష్, కుసుమ భవాని శంకర్, దినేష్ చౌదరి, అర్జున్ దేవాసి, రాదేశ్యం గౌమి, రాకేష్ గౌడ్ , కొత్త హరిబాబు గుర్రం కపిల్ తదితరులు పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు కీర్తిశేషులు సూరపనేని శేషు కుమార్

**ఖమ్మం,ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :**చిరస్మరణీయుడు కీర్తి శేషులు సూరపనేని శేషుకుమార్ అని వ్యక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో కీర్తిశేషులు సూరపునేని శేషు కుమార్ నాలుగవ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఖమ్మం జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాల సంఘం ( టిఆర్ఎస్ఎంఎస్) ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు శేషు కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు. శేషు కుమార్ బడ్జెట్ పాఠశాల లకు ఎంతో అండ దండగా ఉంటూ, వాటి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, వారు చిరస్మరణీయులను తెలిపారు. ఈ సందర్భంగా మేనేజ్మెంట్ స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా ఇనుగంటి ప్రసాద్ రావు, కాకర్ల బాల ప్రసన్న భవిష్యత్తులో నైపుణ్యాలతో పాఠశాల నిర్వహణ అనే అంశాలపై ప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. ఈ నిర్వహణలో ముఖ్యంశాలు - మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠశాలల నిర్వహణ, విద్యాబోధనలో తీసుకురావాల్సిన మార్పులపై పాఠశాలల కరస్పాండెంట్లకు ప్రత్యేక యాజమాన్య శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రస్తుతం పాఠశాలలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు, వాటి పరిష్కార మార్గాలపై ఈ కార్యక్రమంలో సమగ్రంగా చర్చించారు. --- శిక్షణలోని ముఖ్య అంశాలు, ఉపాధ్యాయుల నిలకడ ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు పాఠశాలలో సుదీర్ఘకాలం కొనసాగేలా మెరుగైన వాతావరణం, ప్రోత్సాహం అందించాలి. ఆధునిక బోధనా పద్ధతులు, దశాబ్దాల క్రితం



విజయాన్ని అందించిన పాత పద్ధతులకే పరిమితం కాకుండా, ప్రస్తుత మరియు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నూతన బోధనా విధానాలను అలవర్చుకోవాలి.స్వేచ్ఛతో కూడిన క్రమశిక్షణ: పిల్లలపై బలవంతపు క్రమశిక్షణను రుద్దడం కంటే, బాధ్యతను గుర్తించేలా 'స్వేచ్ఛతో కూడిన క్రమశిక్షణ' అలవాటు చేయాలి.సమిష్టి నిర్ణయాలు, నిర్ణయాధికారం యాజమాన్యానికే పరిమితం కాకుండా, నిర్ణయ ప్రక్రియలో ఉపాధ్యాయులను, విద్యార్థులను భాగస్వామ్యులను చేయాలి.అపజయాల నుండి నేర్చుకోవడం: వైఫల్యం అనేది అంతం కాదు. ఓటమికి కుంగిపోకుండా, దానికి గల మూల కారణాలను అన్వేషించి, పరిష్కరించే దిశగా అడుగులు వేయాలి. తల్లిదండ్రుల భాగస్వామ్యం, పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వామ్యులను చేస్తూ, వారి అభిప్రాయాలు, సూచనలను నిరంతరం స్వీకరించాలి.ప్రాయోగిక విద్య, పాఠాలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, వాస్తవ ప్రపంచంలోని సమస్యల పరిష్కారానికి విద్యార్థులు తమ జ్ఞానాన్ని ఎలా ఉపయోగించాలో నేర్పించాలి. ప్రాజెక్టులు, కృత్యాల ద్వారా బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఆత్మవిశ్వాసం పెంపొందించడం: విద్యార్థుల్లో భయం తొలగించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం అత్యంత ముఖ్యం.ఫలితం కంటే ప్రయాణమే ముఖ్యం: కేవలం మార్కులు,



ఫలితాల పైనే కాకుండా, నేర్చుకునే విధానం/ప్రక్రియ పై దృష్టి పెట్టాలి. సరైన విధానాన్ని అనుసరిస్తే ఆటోమేటిక్‌గా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. ఇటీవల కాలంలో ప్రమాదవశాత్తు మరణించిన ప్రైవేటు కరస్పాండెంట్, ప్రైవేట్ అధ్యాపకుల కుటుంబాలకి చెరొక లక్ష రూపాయల చొప్పున ఆర్థికంగా సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ఎంఏ రాష్ట్ర బాధ్యులు శివరాత్రి యాదగిరి, వివిధ జిల్లాల టిఆర్ఎస్ఎంఏ అధ్యక్షులు, కార్యదర్శులు ట్రెజరర్లు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుర్రం కాంతారావు, కార్యదర్శి నాయుడు వెంకటేశ్వర్లు, ట్రెజరర్ నాసరయ్య, అడ్వైజర్ సంక్రాంతి రవికుమార్ ,ఖమ్మం జిల్లా టిఆర్ఎస్ఎంఏ రాష్ట్ర నాయకులు ఐ వి రమణ రావు, అడ్వైజర్ కేశ వీరన్న ,అసోసియేట్ ప్రెసిడెంట్ కె శశిధర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శంకరయ్య, సెక్రటరీ ప్రవీణ్ ,ఈసీ మెంబర్ ఇస్మాయిల్ ,ఖమ్మం జిల్లా వివిధ డివిజన్ల అడ్వైజర్లు ,అధ్యక్షులు, కార్యదర్శులు, ట్రెజరర్ పాల్గొన్నారు. పూర్వ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ గవర్నమెంట్ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (టిజిసిజిటిఏ)

# రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ కే కిరణ్ కుమార్ ఎన్నిక

**ఖమ్మం,ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలంగాణ గవర్నమెంట్ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (టిజిసిజిటిఏ) రాష్ట్ర ఎన్నికలు హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ క్లబ్ లో నిర్వహించారు. ఈ ఎన్నికలలో అధ్యక్షులు డా కే సురేందర్ రెడ్డి ప్యానెల్ తరుపున డా. కే కిరణ్ కుమార్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫిజిక్స్ ఎస్ ఆర్ అండ్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల ఖమ్మం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గంలో ఖమ్మం జిల్లా నుండి అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి కి, మాజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ గోపి కి, జిల్లా అధ్యక్షులు డాక్టర్ పి విజయ్ కుమార్, కార్యదర్శి సూరంపల్లి రాంబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. డా. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా నుంచి అవకాశం నుంచి



కల్పించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. సభ్యుల యొక్క సమస్యల పరిష్కారంలో రాష్ట్ర కార్యవర్గంతో సమన్వయపరచుకుంటూ సమస్యలను పరిష్కరిస్తామని తెలియజేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ కి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాకీరుల్ల, జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ ఎన్ మాధవరావు, డా పి రవికుమార్, శ్యామలా దేవి, డా కుక్కల కార్తీక్, డా వి బ్రహ్మం, డా. బూరుగు శ్రీనివాస్, డా డి సుజాత, పల్ల శ్రీనివాస్, డా రవీందర్ రెడ్డి, డా ఎస్



శ్యాంప్రసాద్, డా. ఎస్ బాబు, డా.పూర్ణచంద్రరావు, సిహెచ్ మల్లేష్, రామ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి రమేష్, డా. బి వెంకన్న, కొండల రావు, అనురాధ, విద్యా ప్రవీణ, తదితరులు అభినందనలు తెలియజేశారు.

# ఐఓసి సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

**ఖమ్మం,ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :**

అమెరికాలో జరిగిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (ఐఓసి) ప్రతినిధుల సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలంగాణ అభివృద్ధి దిశను ప్రపంచ వేదికపై ఆవిష్కరించారు.2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ', యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ ఐటీఐల ఆధునీకరణ వంటి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు.దేశంలోనే తొలిసారిగా 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉదయం పోషకాహార బ్రేక్‌ఫాస్ట్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్థిక క్రమశిక్షణను పునరుద్ధరించి ప్రతి నెల 1వ తేదీన ఉద్యోగుల వేతనాలు చెల్లించడంతో పాటు రూ.1.20 కోట్ల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ఆరు



గ్యారెంటీల అమలు, 'హైడ్రా' ద్వారా ఆక్రమణల నియంత్రణ, మూసీ పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రోడ్, మెట్రో రెండో దశ విస్తరణ వంటి కార్యక్రమాలతో తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.తెలంగాణ పునర్నిర్మాణంలో అమెరికాలోని తెలుగు ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు.

## ఖమ్మం రూరల్ మండలంగూడూరుపాడు గ్రామంలో అల్లిక ఆధ్వర్యంలో పరామర్శ కార్యక్రమం

**ఖమ్మం, ఆగస్టు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం రూరల్ మండలం, గూడూరుపాడు బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో గ్రామంలోని పలువురు కుటుంబాలను ఆదివారం పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హర్షిణి డెవలపర్స్ అధినేత అల్లిక వెంకటేశ్వరరావు, గూడూరుపాడు బీఆర్ఎస్ యూత్ సభ్యులు, గూడూరుపాడు గ్రామ శాఖ నాయకులు పాల్గొన్నారు.తొలుత ఎస్సీ కాలనీలోని స్టాలిన్ ని పరామర్శించి, వారికి ధైర్యం చెబుతూ భరోసా కల్పించడం జరిగింది. అనంతరం నాలుగో వార్డుకు చెందిన లంజపల్లి నరేష్ కుటుంబాన్ని పరామర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.తదుపరి ఇటీవల మోకాలి శస్త్రచికిత్స చేయించుకున్న బండి రవి ని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే బండి గోపి, బండి గోపయ్య, కుర్రి సంగయ్య, గుజ్జర్లపూడి వెంకటేశ్వర్లు ని కూడా పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాధలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం, వారి కష్టసుఖాల్లో భాగస్వాములు కావడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.



# మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాజీ ఎంపీ నామ సుడిగాలి పర్యటన

- **పరామర్శలు, ఆశీర్వాదాలు, పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎంపీ నామ**

**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ గ్రానైట్ వ్యాపారి బుగ్గవీటి శ్రీధర్ తండ్రి, ప్రముఖ వైద్యులు డా. బుగ్గవీటి సమత మామయ్య, రిటైర్డ్ ఇంజనీర్ బుగవీటి కోటేశ్వరరావు ఇటీవల పరమపదించిన నేపథ్యంలో బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదివారం ఖమ్మం నగరంలోని వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నామ, అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు వియ్యంకుడు, తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డా. వాసిరెడ్డి రామనాథం, డా. గౌతమ్, కుటుంబ సభ్యులు, నాయకులు కనకమేడల సత్యనారాయణ, మోరంపూడి ప్రసాద్‌రావు, వాకదాని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అటుపై చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామ మాజీ సర్పంచ్ వేముల నర్సయ్య అనారోగ్యంతో ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని, ఖమ్మం మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజుతో కలిసి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. నర్సయ్య ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న నామ, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. తదుపరి బీఆర్ఎస్ జిల్లా నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు ఇటీవల అనారోగ్యం నుంచి కోలుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, ఆయన త్వరగా పూర్తిగా కోలుకుని ప్రజా, సామాజిక కార్యక్రమాల్లో మళ్లీ చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం వైరా మున్సిపాలిటీ 5వ వార్డుకు చెందిన కొణతాలపల్లి సుబ్బారావు నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆపై మధిర పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహదేవపురం సర్పంచ్ వాసిరెడ్డి నాగేశ్వరరావు మనవడు పంచకట్టు వేడుకలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తో కలిసి పాల్గొని పావన్ శివచంద్రను ఆశీర్వదించారు. చివరగా ఇటీవల తన మాతృమూర్తిని కోల్పోయిన మాజీ వార్డు కౌన్సిలర్ ధీరావత్ మాధవి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, మాజీ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, మాజీ జడ్పీటీసీ సామినేని హరి ప్రసాద్, మాజీ దిశా కమిటీ సభ్యులు బాదావత్ బాలాజీ, బిక్కి కృష్ణప్రసాద్, రావూరి శ్రీనివాసరరావు, పల్లపోతుల వెంకటేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, చిత్తారు నాగేశ్వరరావు, యన్నంశెట్టి అప్పారావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, అరిగే శ్రీనివాసరరావు, మోరంపూడి ప్రసాద్‌రావు, బంకా మల్లయ్య, వంకాయలపాటి లచ్చయ్య, మాదినేని దుర్గాప్రసాద్, వాకదాని కోటేశ్వరరావు, అబ్బూరి రామన్, వనమా చిన్ని, పెరుమాళ్ల కృష్ణమూర్తి, మిట్టపల్లి సత్యంబాబు, తిరుపతి శ్రీను, నూకల వాసు,నూకల ప్రసాద్, వజినేపల్లి చక్రవర్తి, కారేపల్లి రామకృష్ణ, రంగా సింహాద్రి, రాయిడి భద్రయ్య, బాలాజీ, కొమ్మూరి కనకరత్నం, వేముల శివకృష్ణ, గుజ్జర్లపూడి దేవరాజు, యూఎస్‌కే ఖాసిం, వెంకటేశ్వరరావు, గజ్జల కృష్ణమూర్తి, ఖాజా సైదులు, కొణతాలపల్లి సుజిత్, దారా కృష్ణ, కిషోర్, కేశ శ్రీనివాసరావు, నాళ్ల గంగాధర్, ఖాజా ప్రవీణ్ కుమార్, కోదుమూరు రవి, ఏదునూరి శ్రీనివాసరావు, వల్లభి శ్రీనివాసరావు, పగడాల రవి, నంబూరి రామారావు, మాదినేని లక్ష్మణ్, కోడుమూరు మోహన్, ఆకుల రాజు, ఏలూరు నరసింహారావు, అదూరి ప్రేమ్, నార్వనేని నారాయణ, మాలోజి రాజేష్, కొలగాని దేవరాజు, తెల్లాకుల శ్రీనివాసరావు, ముచ్చింతల కృష్ణా, కోలకాని నాగేశ్వరరావు, పాగి నాగార్జున, యండ్రాతి గోపాలరావు, ముదిగొండ పుల్లయ్య పాల్గొన్నారు.







# నల్లగొండ నరసయ్యకు నివాళులర్పించిన ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్సీ సారయ్య



**వరంగల్, (జర్నలిస్ట్ ఫైల్) :** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామంలో పీసీసీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నల్లగొండ రమేష్ తండ్రి నల్లగొండ నరసయ్య శనివారం రాత్రి మరణించాడు.ఈ సమాచారం అందుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య తోపాటు ఆదివారం తిమ్మాపేటకు విచ్చేసి నల్గొండ రమేష్ ను కలిసి నరసయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు..అనంతరం నల్లగొండ రమేష్ ను వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,నరసయ్య మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈవిషాద సమయంలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, తత్తరి లక్ష్మణ్, జన్ను రవి, డీసీసీ ఉపాధ్యక్షులు కూరతోట సదానందం, ప్రధాన కార్యదర్శులు గోరంటల రాజు, ధూపం సంపత్,ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ కోదాటి అనిల్ కుమార్, నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నారగోని స్వప్న మురళి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమలక్ష్మి , నీటిపారుదల శాఖ విశ్రాంత డీఈ మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు బస్వరాజ్ కుమారస్వామి, బొలుగొడ్డు శ్రీనివాస్, మొలుగూరి విశ్వనాథం, ఎన్ఎస్‌యూఐ నగర మాజీ అధ్యక్షుడు చాగంటి శ్రీనివాస్, 21వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మల సందీప్,కూచన ఏకాంబరం, రామ యాదగిరి, ఈటెల ఉమా మహేందర్, వెల్లండి లక్ష్మణ్, గిరి గిరి పుష్ప తదితరులు పాల్గొని నరసయ్య కి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## పాత పాల్వంచలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో శ్రీరామ హృదయ కలశం, ప్రత్యేక పూజలు

**- పూజల్లో పాల్గొన్న 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి**



**ఖమ్మం,ఆగస్టు 3,(జర్నలిస్ట్ ఫైల్):** శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో శ్రీరామ హృదయ కలశంతో పాత పాల్వంచలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోకకళ్యాణార్థం చేసే పూజలను ఆదివారం పూజారులు కందాల ఆనందకుమారాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజలు అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి ముఖ్య అతిధి గా పాల్గొని పూజలు చేశారు. దేవాలయం నూతన ఇ.ఓ గా బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పాత పాల్వంచ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఇ.ఓ గా బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి ని సన్మానించిన కార్పొరేటర్ విమలాదేవి, పాత పాల్వంచలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి నూతన కార్యనిర్వాహణాధికారిగా విజయలక్ష్మి ని బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం దేవాలయంలో నూతన ఇ.ఓ ను పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి శాలువా, బోకేలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ కార్పొరేటర్ చెరుకూరి భాగ్యలక్ష్మి , పావని నాగరాజు, కిలారి సుజాత, కంచర్ల విమల, పుల్లారెడ్డి మరియు భక్తులు పాల్గొన్నారు.

## లక్ష్మయ్యకు ఘన నివాళి



**ఖమ్మం, ఆగస్టు 3,(జర్నలిస్ట్ ఫైల్):** లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన బత్తుల శ్రీనివాసరావు, అజ్మీర వీరన్న , ధరావత్ వినోద్ ,నరేంద్ర. కారేపల్లి మండల పరిధిలోని గుంపెల్ల గూడెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు ఎర్రబెల్లి రాము సతీష్ ల తండ్రి లక్ష్మయ్య ఇటీవల మృతి చెందారు. ఆదివారం దశ దిన కార్యక్రమానికి మండల సీనియర్ నాయకులు బత్తుల శ్రీనివాసరావు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న, మండల నాయకులు ధరావత్ వినోద్ కుమార్, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి నరేంద్ర, రామూర్తి కార్యక్రమానికి హాజరై ఘనంగా లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ శాసనసభలు లావుడియా రాములు నాయక్ ఆ కుటుంబానికి కొంత ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు. ఎర్రబెలి శ్రీను బాబోత్ వీరన్న (చక్రం) రఘు, కోటి, భావుసింగ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## కాశీ పీఠాధిపతి చే ఈ నెల 13 తేదీన శ్రావణమాసం సందర్భంగా ఇష్ట లింగ మహా పూజ ఈ పూజా కార్యక్రమంలో వేలాది మంది పాల్గొనండి..!

**- వీరశైవ సమాజం చౌకీ మఠం అధ్యక్ష కార్యదర్శులు**



**సంగారెడ్డి, (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీమద్ జ్ఞానసింహాసనాధీశ్వర శ్రీ శ్రీ శ్రీ డా. చంద్రశేఖర శివాచార్య మహాస్వాముల శ్రావణ మాసం ధర్మ ప్రచార పర్యటన వివరాలు. 1 ఆగస్టు 12వ తేది రాత్రికి సదాశివపేటలో13 వ తేదీఉదయం. 7 గం. లకు ఇష్ట లింగ మహాపూజా. అనంతరం ఆశీర్వచన సందేశము.వివరాలకు.చీల మల్లన్న అధ్యక్షులు వీరశైవ సమాజము సదాశివపేట.తేది 13 ఆగస్టు మధ్యానం 2 గం లకు షాద్నగర్ .తేది 13వ తేదీ షాద్ నగర్ లో సాయంకాలము 5 గం లకు బసవేశ్వర విగ్రహం ఆవిష్కరణ.వివరాలకు . ఏ.బసవేశ్వర చైర్మన్ షాద్ నగర్ మున్సిపల్.తేది 13 రాత్రి వేదపాఠశాల యందు విడిది.తేది 14 ఉదయం ముంబై ప్రయాణం.తేది 16 నాడు అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ మహారాష్ట్ర వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొందురు.తేది 16 ముంబై నుంచి వారణాసి. శ్రీ జగద్గురువుల వారు శ్రావణ మాసం లో తమ పీఠములో అనుస్టానము చేయుదురు. శ్రీమద్ కాశీ జగద్గురువుల జన్మ దినోత్సవము తేది 24 ఆగస్టు నాడు కాశీ జంగమ వాడి మఠం నందు జరుగును.జగదేవ్ హిరేమట్

# కమ్యూనిజం అజరామరం

- ఈ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించా
- కమ్యూనిస్టుల ఆవశ్యకత పెరుగుతోంది
- సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు
- అట్టహాసంగా ఖమ్మం రూరల్, తిరుమల పాలెం మండలాల సిపిఐ శిక్షణా తరగతులు





**ఖమ్మం, ఆగస్టు 03, (జర్నలిస్ట్ ఫైల్) :**

సిపిఐ పార్టీ 100 ఏండ్ల చరిత్రలో అధికారం ఉన్నా లేకపోయినా ప్రజా సమస్యలపై పోరాడుతూ అజరామరంగా కొనసాగుతోందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీలోని ముత్తగూడెం లోని అనుముల రామ్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల సిపిఐ శిక్షణా తరగతులను నిర్వహించారు. తొలుత ముత్తగూడెంలో ఏర్పాటుచేసిన అరుణ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులకు అధికారంతో అవసరం లేదని బూర్జువా పార్టీలకు మాత్రమే అధికారం కావాలన్నారు. ఆ పార్టీలు అధికారం ఉన్నప్పుడు కనిపిస్తాయని అధికారం పోయిన తర్వాతికి కాలగర్భంలో కలిసిపోతాయన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు హక్కులు సాధించడంలో కమ్యూనిస్టుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఇందులో ప్రధానంగా హక్కులు సాధించడంలో ప్రజల పక్షాన చట్టసభల్లో గల మెత్తెందుకు ఎంపీ ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. కానీ డబ్బు ప్రభావం పెరగడంతో కమ్యూనిస్టులు బలహీనపడ్డారని, కార్పొరేట్ శక్తులు బలపడి దేశాన్ని దోచుకుంటున్నాయన్నారు. అలాగే మతం ముసుగులో మోడీ ప్రజల మధ్య అవాంతరాలను సృష్టిస్తూ అధికారాన్ని అనుభవిస్తున్నారని దుయ్యబట్టారు. తామెప్పుడు మతంపై విమర్శలు చేయలేదని కేవలం కుల మత అంతర్యాలు లేని సమ సమాజ రూపాన చందాలని మాత్రమే కోరామన్నారు. మరి శ్రీరాముడి పేరుతో రాజకీయం చేస్తున్న మోడీ తన హయాంలోనే నిర్మితమైన అయోధ్యలో 14 వేల కోట్ల అవినీతి జరిగిందన్నారు. వారికి మతం దేవుళ్ళ పట్ల ఎటువంటి ప్రేమ లేదని కేవలం అధికారకాంక్షం మాత్రమే అని స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు ఆవశ్యకత పెరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకుని నడిపిస్తున్న ట్రంప్ కూడా కమ్యూనిస్టు భూతం ప్రపంచాన్ని ఆవహించబోతుందని పేర్కొన్నాడన్నారు. అలాగే ఢిల్లీ జంతర్ మంతర్ ఉద్యమ సాధాంతం విద్యార్థులు ఇంక్విలాబ్ జిందాబాద్ అనే స్లోగన్స్ తోనే ముందుకు సాగారన్నారు. అలా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంతవరకు పోరాడారన్నారు. ఈ సందర్భంలో ఇంట్లో తల్లిదండ్రులతో ఒక్క చంప దెబ్బతిని వారు పోలీసులతో లాటి దెబ్బలు తిని ఎదురొడ్డి నిలబడ్డారన్నారు. కమ్యూనిస్టులు కూడా ఆ పోరాట పటిమ అవసరమని దిశా నిర్దేశం చేశారు. ఈ శిక్షణా తరగతుల్లో ఉపాధ్యాయుడిగా భాగం హేమంతరావు, ప్రిన్సిపాల్ గా సిద్ధినేని కర్ణ కుమార్, వైస్ ప్రిన్సిపల్ గా ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు మెడకంటి చిన్న వెంకటరెడ్డి, రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షులు అజ్మీరా రామ్మూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, సింగ్ నరసింహారావు, ఏనుగు వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు దంతాల బాలరాజు, లింగా వెంకటనారాయణ, సురేందర్, పగిళ్ల వీరభద్రం, యడ్లపల్లి శంకరయ్య , బూర నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ గౌస్ పాషా, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, 28, 32 వార్డుల సిపిఐ కౌన్సిలర్లు దండి రంగారావు మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఖజానా శాఖలో పనిచేయడం ఎంతో సంతృప్తి ఇచ్చింది

**- జిల్లా ట్రెజరీ అధికారి వెంకటపలి సత్యనారాయణ**






**ఖమ్మం, ఆగస్టు 03, (జర్నలిస్ట్ ఫైల్) :** ఖజానా, అకౌంట్స్ శాఖలో 31 సంవత్సరాలుగా సుదీర్ఘ ప్రయాణం చేసి సర్వీస్ నందించి డిటిఓ మహబూబాబాద్ నందు డిటిఓ గా ఉద్యోగ విరమణ పొందిన వెంటపల్లి సత్యనారాయణ కి మహబూబాబాద్ లో ఖజానా శాఖా సిబ్బంది ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ కార్యక్రమంలో ఏలూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంటపల్లి సత్యనారాయణ వివిధ హోదాలలో ట్రెజరీలో పనిచేస్తూ ఎంతో విలువైన సేవను అందించారని ట్రెజరీ డిపార్ట్మెంట్ కి సంబంధించి ఖజానా చరిత్ర – పరిణామాలు పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమని ఇది ఉద్యోగులకు ట్రెజరీ చరిత్రను తెలుసుకోవడానికి మరియు ఆచరణలలో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ మహబూబాబాద్ పురుషోత్తం, ఖమ్మం టీజీవో కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీజీవో మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు రఫీ, షేక్ ఖాజా మియా, బానోత్ దస్రు ఎన్. వి. కృష్ణారావు జి శ్రీనివాస్ రామకృష్ణ షరీఫ్ బాబా దుర్గాప్రసాద్ టి వెంకటేశ్వర్లు శ్రీనివాసరావు ప్రసన్నకుమార్ శారద సునీత ఉదయ భాస్కర్ సాగర్ కృష్ణ యాదవ్ రామకృష్ణ వెంకన్న రమేష్ సుందర్ రవిచంద్ర, ప్రవీణ్ రవీంద్ర బాబు ప్రసన్న కుమార్ రాజా సాహెబ్ సాయి ప్రవీణ్ వెంకటేశ్ యాదవ్ పృథ్వీ కోలా వెంకటేశ్వర్లు మధిర వెంకటేశ్వర్లు ఫణిరాజకుమార్ విజయకుమార్ సౌజన్య జ్యోతి రమణ పద్మావతి శైలజ ఉమ్మడి ఖమ్మం జిల్లా గెజిటెడ్ అధికారులు, టీఎన్జీవోస్, పెన్షనర్స్ అసోసియేషన్స్, బంధుమిత్రులు శ్రేయోభిలాషులు, ఖమ్మం జిల్లా ఖజానా కార్యాలయం సిబ్బంది కొత్తగూడెం జిల్లా ఖజానా కార్యాలయ సిబ్బంది మహబూబాబాద్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొని సార్ ని ఘనంగా సన్మానించడం జరిగింది.

## ప్రజలకు తక్కువ ధరలకే నిత్యావసరాలు



బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్): బాపట్ల రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో తగ్గించిన ధరలకే బియ్యం విక్రయించే కార్యక్రమాన్ని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్ల కౌంటర్లు మరియు 500 రైస్ మిల్లర్స్ ప్రత్యేక పాయింట్ల ద్వారా తగ్గించిన ధరలకే నాణ్యమైన బియ్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అర్హులైన ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ హరి కుమార్,జనసేనా నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, బాపట్ల పట్టణ అధ్యక్షుడు,నాటక అకాడమీ డైరెక్టర్ మందపాటి ఆంద్రెయ,బాపట్ల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, కూటమి నాయకులు మరియు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ సొంత నిధులతో చేతివృత్తిదారులకు వెల్డింగ్ మిషన్ల పంపిణీ



- మంగళగిరి నియోజకవర్గంలో లబ్ధిదారులకు అందజేత
- స్వయం ఉపాధికి ప్రోత్సాహమే లక్ష్యమని టీడీపీ నాయకులు వెల్లడి

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో మంగళగిరి నియోజకవర్గంలోని చేతివృత్తిదారుల స్వయం ఉపాధిని ప్రోత్సహించే లక్ష్యంతో వెల్డింగ్ మిషన్లను పంపిణీ చేశారు. మంత్రి ఆదేశాల మేరకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పెనుమాక, తాడేపల్లి, మంగళగిరి ప్రాంతాల్లో లబ్ధిదారులకు వెల్డింగ్ మిషన్లను అందజేశారు. పెనుమాకలో షేక్ ఖాసీం షరీఫ్, గరికపాటి యేసుకు, తాడేపల్లి 23వ వార్డులో పెండ్యాల గోపీకి, మంగళగిరిలో మద్దిమడుగు చక్రధర్, షేక్ బాజీలకు వెల్డింగ్ మిషన్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పేదలు, చేతివృత్తిదారులు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా మంత్రి నారా లోకేష్ తన సొంత నిధులతో ఉపాధి కల్పించే కార్యక్రమాలను నిరంతరం చేపడుతున్నారని తెలిపారు. వెల్డింగ్ మిషన్లు లబ్ధిదారులకు స్థిరమైన ఆదాయ వనరుగా మారి వారి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ అందించిన సహాయానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో తాడేపల్లి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పాలేపు రవీంద్రనాథ్ (బాబీ), తాడేపల్లి పట్టణ పార్టీ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు, మంగళగిరి పట్టణ పార్టీ అధ్యక్షుడు పడవల మహేష్, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ తిరగబడి రైతుకూలీ మృతి

కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):ట్రాక్టర్ తిరగపడి రైతు కూలీ మృతి చెందిన ఘటన కాకుమాను మండలం లో చోటు చేసుకుంది.కాకుమాను ఎస్ ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కాకుమాను మండలం పరిధిలోని రేటూరు గ్రామానికి చెందిన ఉప్పిరెట్ల వెంకాయమ్మ ఫిర్యాదు మేరకు తన భర్త అయిన ఉప్పిరెట్ల రాజేంద్రప్రసాద్ రేటూరు గ్రామంలో తన సొంత పొలంలో వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తూ ఉంటాడన్నారు.రోజువారి లాగానే ది 02.08.2026 రేటురూ శివారులోని జమ్ములపాలెం బ్రిడ్జి దగ్గర్లో తన సొంత పొలానికి తన డాక్టర్ తో వరి పొలానికి ఎద పెట్టడానికి వెళ్లి తిరిగి వస్తుండగా జమ్ములపాలెం బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి పొలాల్లో నుంచి మెయిన్ రోడ్ కి వస్తుండగా ట్రాక్టర్ టైర్లు జారీ ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న కాల్వలోకి ట్రాక్టర్ తిరగబడి ట్రాక్టర్ కింద డ్రైవర్ రాజేంద్రప్రసాద్ బురదలో కూరుకుపోయి చనిపోయాడని తెలిపారు.కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

## మద్యం బెల్టు షాపులను వెంటనే తొలగించాలి : వివిధ సంఘాల నాయకులు డిమాండ్



తెనాలి (జర్నలిస్ట్ ఫైల్): మండల గ్రామమైన గుడివాడలో దళిత వాడకు మౌలిక వసతులు కల్పించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇప్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మరియు కులవివక్ష పోరాట సంఘం నాయకులు సచివాలయ కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం,కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో స్థానిక దళితవాడలో సర్వే నిర్వహించి అందులో వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ దళితవాడలో మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని ముఖ్యంగా అంబేద్కర్ విగ్రహం నుండి డిఆర్ బిసిసి మురుగు కాల్వ వరకు కాలువను నిర్మించాలని కోరారు.పక్కా ఇల్లు నిర్మించుకొని సంవత్సరాలు అయినా గాని ఇంతవరకు పట్టాలు మంజూరు కాకపోవటం వలన విద్యా, వైద్యం అవసరాలలో రుణం కోసం ఇబ్బంది పడాల్సి వస్తుందని పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రుణాలు లేకపోవటం వలన అధిక వడ్డీలు తెచ్చి వ్యవసాయం చేయాల్సి వస్తుందని ప్రభుత్వం కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని ఆయన కోరారు.సచివాలయ కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ 16వ ఆర్థిక సంఘం విధులు విడుదలైన వెంటనే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు ములకా శివసాంబి రెడ్డి, మల్లోల నాగరాజు, కర్రే దానియేలు, బండి సుధాకర్, కంచర్ల ఇస్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## అవయవదానం మరో జీవితానికి పునర్జన్మ ఇవ్వడమే : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- ఒక అవయవదాత ఎనిమిది మందికి కొత్త జీవితం అందించగలడు
- అవయవదానంపై యువతలో అవగాహన పెరగాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): అవయవదానం అంటే మరో జీవితానికి పునర్జన్మ ఇవ్వడమేనని, ఒక అవయవదాత మరణానంతరం ఎనిమిది మంది వరకు కొత్త జీవితం అందించగలడని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా సోమవారం గుంటూరులో సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అవయవదానం కోసం ముందుకు వచ్చే ప్రతి వ్యక్తే నిజమైన ముఖ్య అతిథి అని, సమాజానికి జీవదానం చేసే వారే చిరకాలం ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని పేర్కొన్నారు. అవయవదానం కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన విషయం కాదని, అది ఒక కుటుంబానికి, సమాజానికి కొత్త ఆశను అందించే అత్యున్నత మానవతా కార్యక్రమమని ఎమ్మెల్యే అన్నారు. సావిత్రిబాయి పూలే వంటి మహనీయుల సేవల వల్లే సమాజం అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. అన్నదానం ఆకలి తీర్చగలదని, విద్యాదానం భవిష్యత్తును నిర్మిస్తుందని, రక్తదానం ఒక ప్రాణాన్ని కాపాడుతుందని, కానీ అవయవదానం ఒక మనిషికి పూర్తిగా కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుందని పేర్కొన్నారు. అవయవదానం చేసిన వారికి ప్రభుత్వం గౌరవప్రదమైన లాంఛనాలతో అంతిమ వీడ్కోలు పలికే విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు.

విద్యార్థులు, యువతే దేశ భవిష్యత్తని, అవయవదానంపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించి మరింత మందిలో అవగాహన కల్పించాలని గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. అవయవదానం పట్ల మహిళలు, యువత ముందంజలో ఉండటం అభినందనీయమని, ఈ అవగాహనను ప్రతి కళాశాల, ప్రతి యువకుడి వద్దకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, బ్రహ్మకుమారీస్ సభ్యులు, అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మంగళగిరి-తాడేపల్లి నగరంలో రూ.2.43 కోట్లతో వీధి దీపాల వ్యవస్థ బలోపేతం

- ఎంటిఎంసి కమిషనర్ అలీం బాషా



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ) : మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో వీధి దీపాల వ్యవస్థను మరింత ఆధునికీకరించేందుకు రూ. 2.43 కోట్లతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు కమిషనర్ అలీం బాషా తెలిపారు. నగరంలో ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలన్న లక్ష్యంతో, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు ఈ పనులను ప్రాధాన్యతగా అమలు చేయనున్నట్లు సోమవారం కమిషనర్ వెల్లడించారు.

నగరంలో వీధి దీపాల అవసరం ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఏపీసీపీడీసీఎల్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక సూచనల మేరకు అవసరమైన ప్రాంతాల్లో మూడో వైర్ ఏర్పాటు, విద్యుత్ సరఫరా వ్యవస్థ మెరుగుదలతో పాటు కొత్త వీధి దీపాల ఏర్పాటు చేపట్టనున్నారు. ఈ పనుల కోసం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 1.38 కోట్లు, నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి రూ. 1.05 కోట్లు వెచ్చించి మొత్తం రూ. 2.43 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో దశలవారీగా వీధి దీపాలకు ప్రత్యేక విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసి నగరంలో వెలుతురు సౌకర్యాన్ని మెరుగుపరచనున్నారు.

**ప్రజల భద్రతకు ప్రాధాన్యం**

ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, రద్దీ ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో వీధి దీపాల వ్యవస్థను బలోపేతం చేయటం జరుగుతుందని, దీంతో రాత్రి వేళల్లో వాహనదారులు, పాదచారులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులకు మరింత సురక్షితమైన వాతావరణం ఏర్పడుతుందని కమిషనర్ తెలిపారు. ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా వీధి దీపాల ఏర్పాటు ద్వారా ప్రజా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు నగర సుందరీకరణకు కూడా దోహదపడుతుందని అలీం బాషా పేర్కొన్నారు. వీధి దీపాల వ్యవస్థ అభివృద్ధి పనుల ప్రణాళిక, అమలు, నాణ్యతపై నిరంతర పర్యవేక్షణలో ఏపీసీపీడీసీఎల్ అధికారులతో సమన్వయం చేసుకుని పనులను సకాలంలో పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.

**సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయండి**

వీధి దీపాల పనితీరుకు సంబంధించి సమస్యలు ఉంటే నగర ప్రజలు మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ ప్రత్యేక కాల్ సెంటర్ నంబర్లు 70939 12653, 08645–295192లకు సమాచారం అందించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సూచనలపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఆలీం బాషా తెలిపారు.

## మత్స్యకారులు, ఆక్వా రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

- ఎల్‌నినో ప్రభావంతో నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి అవసరం: ఉప మత్స్య సంచాలకులు కె. నాగయ్య



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ): ప్రపంచ వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకుంటున్న అసాధారణ మార్పుల నేపథ్యంలో రాబోయే కాలంలో వర్షాభావం లేదా అధిక వర్షపాతం వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, వాటిని ఎదుర్కొనేందుకు మత్స్యకారులు, ఆక్వా రైతులు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని వైఎస్సార్ కడప జిల్లా ఉప మత్స్య సంచాలకులు కె. నాగయ్య సూచించారు.

ఎల్‌నినో ప్రభావం కారణంగా ఋతుపవనాల ద్వారా కురిసే వర్షపాతం తగ్గే అవకాశం ఉందని తెలిపారు. దీంతో నదులు, చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గి, మంచినీటి మత్స్య సంపదపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. నీటి మట్టాలు తగ్గడం, నీటి ఉష్ణోగ్రత పెరగడం, కరిగిన ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం వల్ల చేపల పెరుగుదల, సంతానోత్పత్తి, ఉత్పత్తి సామర్థ్యం దెబ్బతినే అవకాశముందని వివరించారు.

ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వర్షాధార జలవనరులను సమర్థంగా నిర్వహించడం, నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం, కృత్రిమ సంతానోత్పత్తి (ఇండ్యూస్డ్ బ్రీడింగ్) పద్ధతులను ప్రోత్సహించడం అవసరమని సూచించారు. అలాగే రిజర్వాయర్లు, చెరువులు, కాలువల్లో నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మత్స్యకారులు, ఆక్వా రైతులు సాంకేతిక సూచనలు, హెచ్చరికలను పాటించాలని, నీటి నాణ్యతను కాపాడుతూ ప్రత్యామ్నాయ నీటి వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కోరారు. తక్కువ నీటితో ఎక్కువ ఉత్పత్తి సాధించే ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా చేపల రకాలను ఎంపిక చేసుకుని చేప పిల్లల స్టాకింగ్ నిర్వహించాలని సూచించారు. సాధ్యమైనంత వరకు తక్కువ సాంద్రత కల్చర్ విధానాన్ని అనుసరించాలని పేర్కొన్నారు.


ప్రత్యామ్నాయ జీవనోపాధిగా విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తులు, అలంకరణ చేపల పెంపకం, కాప్టివ్ సీడ్ నర్సరీలు, పోర్టబుల్ హ్యాచరీల ద్వారా చేప పిల్లల ఉత్పత్తి, కాలువలు––చెరువుల పూడికతీత, కొర్రమీనులు (ముర్రెల్), అమూర్ కార్ప్, గడ్డి చేపలు తదితర ప్రత్యామ్నాయ జాతుల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు.

అర్హత కలిగిన మత్స్యకారులకు ముద్ర రుణాలు, వర్కింగ్ క్యాపిటల్ తదితర ఆర్థిక సహాయ పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం సమీప మత్స్యశాఖ అధికారులను సంప్రదించాలని సూచిస్తూ అవగాహన పోస్టర్లను విడుదల చేసినట్లు వెల్లడించారు.

## రేపు మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ లో స్పాట్ అడ్మిషన్లు

మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్ ): మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 2026 27 విద్యాసంవత్సరానికి సంబంధించి స్పాట్ అడ్మిషన్లు రేపు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి పార్థసారథి తెలిపారు 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అడ్మిషన్లకు అర్హులని పేర్కొన్నారు. కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ సివిల్ ఇంజనీరింగ్ మెకానికల్ ఇంజనీరింగ్ కెమికల్ ఇంజనీరింగ్ కంప్యూటర్ ఇంజనీరింగ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ మెటలాజికల్ ఇంజనీరింగ్ డిప్లమా కోర్సులు సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి కోర్సులు రాష్ట్రంలోని కొద్ది ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రమే అందుబాటులో ఉండడం విశేషమని పేర్కొన్నారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జి పార్థసారథి కోరారు మరిన్ని వివరాలకు 7075922670 లేదా 8985257287 నెంబర్లలో ప్రభుత్వ పాలిటెక్నిక్ మైదుకూరు ప్రిన్సిపాల్ ను సంప్రదించవచ్చని తెలిపారు.

## ఆగస్టు 15వ తేదీ వరకు పంట బీమా గడువు పొడిగింపు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): పంటల బీమా గడువు ఆగస్టు 15వ తేదీ వరకు పొడిగింపు జరిగిందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. శత శాతం రైతులు పంట బీమా చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే 15, 20 రోజుల పాటు తహసీల్దార్, వ్యవసాయ అధికారులు, ఎ.పి.ఎం క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పంటలకు సరిపడా సాగునీరు అందుబాటులో ఉండే అవకాశం లేనట్లు జలవనరులు శాఖ తెలియజేసిందని, తదనుగుణంగా రైతులకు ప్రత్యామ్నాయ పంటలకు వెళ్లాలని అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్ నినో ప్రభావం ఉన్నందున ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించాలన్నారు. మండలాల వారీగా పంట విస్తీర్ణం వివరాలు సమర్పించాలని ఆదేశించారు. కౌలు రైతులకు సి.సి.ఆర్ కార్డులు జారీ చేయాలని చెప్పారు.

గ్రీన్ గుంటూరులో భాగంగా జిల్లాలో గల మున్సిపల్ కమిషనర్ లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పెద్ద ఎత్తున మొక్కలు నాటి ఆయా ప్రదేశాలను, రహదారికి ఇరువైపుల ఆహ్లాదకరంగా తయారు చేయాలని ఆదేశించారు. ప్రతీ మొక్కను జియో టాగింగ్ చేయాలన్నారు. విబి జి రామ్ జి క్రింద వేతనదారులు ఎక్కువ సంఖ్యలో భాగస్వామ్యం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న 22(ఎ) కేసులను ఆగస్టు 15 నాటికి పరిష్కరించాలని ఆదేశించారు. గృహ పట్టాల రెగ్యులరైజేషన్ పై దృష్టి సారించాలని సూచించారు. మున్సిపాలిటీలలో పారిశుధ్యం ముఖ్యంగా కాలువల పరిశుభ్రత, అన్నా కాంటీన్ ల నిర్వహణ, విద్యుత్ దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాలు ముఖ్యంగా ఎస్.సి వసతి గృహాలు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. తాగు నీరుపై గ్రామీణ నీటి సరఫరా విభాగం మరిన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తల్లికి వందనం పథకం కింద వచ్చిన దరఖాస్తులు తక్షణం పరిష్కారానికి పంపించాలని స్పష్టం చేశారు. బడి బయట పిల్లలు ఉండరాదని అన్నారు. 13వ తేదీన సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభోత్సం జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేషశ్రీ, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల విస్తరణ పనులు వేగవంతం చేయాలి



- జాప్యంపై అసహనం వ్యక్తం చేసిన కమిషనర్ మయూర్ అశోక్
- అధికారులు సమన్వయంతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశం

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్ రోడ్ల విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో విస్తరణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై అసహనం వ్యక్తం చేసిన ఆయన, ఇకపై నిర్లక్ష్యానికి తావులేకుండా ఆయా విభాగాధిపతులు స్వయంగా పనులను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

రోడ్డు విస్తరణలో భాగంగా ప్రభావితమయ్యే విద్యుత్ స్తంభాల తరలింపునకు విద్యుత్ శాఖతో జీఎంసీ అధికారులు సమన్వయం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. అలాగే పట్టణ ప్రణాళిక అధికారులు ప్రభావిత భవనాలను తొలగించిన ప్రాంతాలను క్షుణ్ణంగా గుర్తించి డ్రైన్ల నిర్మాణం కోసం వెంటనే ఇంజినీరింగ్ శాఖకు అప్పగించాలని ఆదేశించారు. డ్రైన్ల నిర్మాణాన్ని ముమ్మరంగా చేపట్టడంతో పాటు పూర్తయిన ప్రాంతాల్లో నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించి స్థలాన్ని చదును చేయాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల పురోగతిపై ప్రతిరోజూ నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించిన కమిషనర్, నగర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రోడ్ల విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిటీ ప్లానర్ డి. రాంబాబు, ఎస్‌ఈ సుందర్రామిరెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ రెహ్మాన్, ఈఈ విష్ణు, డీఈఈ వెంకటరమణ, ఏడీహెచ్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్-నల్లపాడు పోలీసుల సంయుక్త దాడి



- ఆరుగురు అదుపులోకి.. నగదు, వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెదపలకలూరు రోడ్డులో చెరువు సమీపంలోని పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్, నల్లపాడు పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు డీఎస్‌బీ డీఎస్పీకి సమాచారం అందించగా, సీఐ–2 ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ దాడిలో ఘటన స్థలంలో ఉన్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, ఐదు సెల్‌ఫోన్లు, రూ. 8,640 నగదును స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు, వాహనాలు, సెల్‌ఫోన్లతో పాటు అదుపులోకి తీసుకున్న వారిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సమస్యలపై పిజిఆర్‌ఎస్ ప్రోగ్రాంలో ఫిర్యాదు



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): బ్రహ్మంగారి మఠం మండలంలో పలు అభివృద్ధి మరియు పలు విషయాలపై భారతీయ జనతా పార్టీ నిర్వహించే వారధి కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ ప్రోగ్రాం నందు అధికారులకు విన్నవించడం జరిగినది. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండలం సోమిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల అదనపు తరగతి గదుల భవన నిర్మాణాపు పనులను మధ్యలోనే నిర్ధాంతరంగా నిలిపివేయడంతో విద్యార్థులకు సరైన తరగతి గదులు లేక అల్లాడుతున్నారని అన్నారు. పలుగురాళ్లపల్లె గ్రామ రెవెన్యూ పొలంలో ఏపీఐఐసీకి కేటాయించిన స్థలంలో ఆక్రమంగా భారీ ఎత్తున మట్టి తరలించి పెద్ద పెద్ద గోతులు త్రవ్వడంపై అసహనం వ్యక్తం చేశారు. ఏపీఐఐసీకి కేటాయించిన స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టాలంటే కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి చదునుచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కొన్ని వేల క్యూబిక్ మీటర్ల మట్టి అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా బయటకు తరలించి ఏపీ ఐసీసీకి కేటాయించిన స్థలం ఒక కుంటగా తయారు చేశారన్నారు.బ్రహ్మం సాగర్ లోయర్ గార్జ్ ప్రధాన కట్ట సమాంతర భాగంలోనే సెన్సిటివ్ జోన్ పరిధిలో పనులు చేపడుతున్న తెలుగు గంగ అధికారుల పనితీరుపై మండల ప్రజలు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. త్రాగునీటి అవసరాల కోసం బ్రహ్మం సాగర్ జలాలు తీసుకెళ్లడానికి సెన్సిటివ్ జోన్ కు పై భాగంలో పనులు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## 945 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ చేసిన నక్కా ఆనందబాబు



○ రైతుల భూ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమన్న ఎమ్మెల్యే

**భట్టిప్రోల (జర్నలిస్ట్ ఫైల్):** భట్టిప్రోలు మండలం రాచూరు స్వర్ణ సచివాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పల్లెకోన గ్రామానికి చెందిన 945 మంది అర్హులైన రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పంపిణీ చేశారు. గ్రామ స్థాయిలోనే రైతులకు ప్రభుత్వ సేవలు అందేలా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ హక్కుల పరిరక్షణ, భూసంబంధిత వ్యవహారాల్లో పారదర్శకత పెంపునకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. "మీ భూమి--మీ హక్కు" నినాదంతో ఎలాంటి వ్యక్తిగత ఫొటోలు లేకుండా ప్రభుత్వ రాజముద్రతో మాత్రమే పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేయడం ద్వారా రైతుల పట్ల ప్రభుత్వ నిష్పక్షపాత వైఖరి ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. ఈ పాస్‌పుస్తకాలు భూమిపై చట్టబద్ధమైన హక్కును మరింత బలోపేతం చేయడంతో పాటు బ్యాంకు రుణాలు, సబ్సిడీలు, ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఉపయోగపడతాయని వివరించారు. ఈ చర్యతో భూ వివాదాలు తగ్గడంతో పాటు రైతుల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరుగుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రయోజనకరంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ పరిరక్షణే జేఏసీ లక్ష్యం



○ 42 వేల మంది ఉద్యోగుల సంతకాలతో సీఎంకు వినతిపత్రాలు

○ డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిక

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ పీటీడీ (ఆర్టీసీ) పరిరక్షణతో పాటు విద్యుత్ బస్సుల పేరుతో ప్రైవేటీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన మూడో దశ ఉద్యమంలో భాగంగా 42 వేల మంది ఆర్టీసీ ఉద్యోగుల సంతకాలతో కూడిన వినతిపత్రాలను 27 జిల్లాల కలెక్టర్ల ద్వారా ముఖ్యమంత్రికి సమర్పించినట్లు ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు. జూలై 30న ఆర్టీసీ ఎండీతో జరిగిన చర్చలు సానుకూలంగా సాగినా, 25 డిమాండ్లపై ఇచ్చిన సమావేశ మినిట్స్‌లో స్పష్టమైన హామీలు లేకపోవడంతో వాటిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ యాజమాన్యానికి లేఖ అందజేశామని పేర్కొన్నారు.

ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని, అన్ని డిమాండ్లపై స్పష్టత వచ్చేలా సవరించిన మినిట్స్ అందిస్తే వాటిపై జేఏసీ చర్చించి నిర్ణయం వెల్లడిస్తామని తెలిపారు. అప్పటి వరకు మూడో దశ ఆందోళన కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే ఉద్యమాన్ని దశలవారీగా మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జేఏసీ ప్రకటించిన కార్యాచరణలో భాగంగా ఆగస్టు 7, 8 తేదీల్లో ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘాల నాయకులను కలిసి ఉద్యమానికి మద్దతు కోరనున్నట్లు తెలిపారు. అలాగే ఆగస్టు 17, 18 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, యూనిట్లలో సామూహిక రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 28న అన్ని జిల్లాల ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) కార్యాలయాల ఎదుట భారీ ధర్నాలు చేపట్టి ప్రభుత్వ దృష్టికి ఉద్యోగుల సమస్యలను తీసుకెళ్తామని జేఏసీ కో-కన్వీనర్లు తెలిపారు.

## శివశక్తి ఫౌండేషన్ పురస్కారాల ప్రదానోత్సవం...



○ రు.12.60 లక్షల బహుమతులు అందజేత

**వినుకొండ(జర్నలిస్ట్ ఫైల్):** తిమ్మాయిపాలెం రోడ్డులోని వై కన్వెన్షన్ హాలులో శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులు, ప్రతిభావంతులైన విద్యార్థుల సన్మాన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, శివశక్తి ఫౌండేషన్ చైర్ పర్సన్ శ్రీమతి గోనుగుంట్ల లీలావతి హాజరై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రోత్సాహకాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శివశక్తి ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సామాజిక, విద్యా సేవలను కలెక్టర్ కృతికా శుక్ల విశేషంగా కొనియాడారు. వేడుకలో భాగంగా మొత్తం రు. 12,60,000 విలువైన నగదు పురస్కారాలను పంపిణీ చేశారు.

10వ తరగతి ఫలితాల్లో ప్రథమ ర్యాంక్ సాధించిన 45 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రు. 10,000 చొప్పున, ద్వితీయ ర్యాంక్ సాధించిన 47 మందికి రు. 5,000 చొప్పున బహుమతులు అందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలకు రు. 1,00,000 నగదు అవార్డును ప్రదానం చేశారు. అలాగే, విద్యాబోధనలో విశేష సేవలు అందించిన 10 మంది హెచ్‌ఎమ్‌లు/ఉపాధ్యాయులకు ఒక్కొక్కరికి రు. 25,000 చొప్పున, 45 మంది సబ్జెక్ట్ టీచర్లకు రు. 5,000 చొప్పున నగదు ప్రోత్సాహకాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, అధికారులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 'సీఎంఆర్ఎఫ్'..పేద ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వ అభయహస్తం: మంత్రి దుర్గేష్

○ నిడదవోలు క్యాంపు కార్యాలయంలో రూ. 38.05 లక్షల విలువైన 49 సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలు పంపిణీ చేసిన మంత్రి దుర్గేష్

○ నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,047 మందికి రూ. 7.17 కోట్ల లబ్ధి చేకూర్చామని వెల్లడి



**నిడదవోలు ఆగస్టు 3 (జర్నలిస్ట్ ఫైల్):** నిరుపేద ప్రజల ఆరోగ్య భద్రతకు కొండంత అండగా నిలుస్తోందని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సోమవారం నిడదవోలులోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 49 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 38,05,881 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీ పత్రాలను మంత్రి దుర్గేష్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ..ఇవాళ 47 మందికి రూ. 32,40,791 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఇద్దరికి రూ. 5,65,090 విలువైన ఎల్వోసీ పత్రాలు అందించామన్నారు. "నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ, ప్రత్యేక ఆర్థిక సాయం ద్వారా మొత్తం 1047 మంది బాధితులకు రూ. 7,17,68,557 ఆర్థిక లబ్ధి చేకూర్చాం."అని మంత్రి కందుల దుర్గేష్ వివరాలు వెల్లడించారు. "ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. అర్హులైన నిరుపేదలకు ప్రతి 15 రోజులకు ఒకసారి నిరంతర ప్రక్రియగా ఈ ఆర్థిక సాయం అందజేస్తున్నాం." అని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. తీవ్ర అనారోగ్యం, అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నం కాకుండా సీఎంఆర్ఎఫ్ భరోసానిస్తోందని, కార్పొరేట్ వైద్యం పేదవాడికి భారం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సహాయాన్ని అందిస్తోంది అని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. బాధితుల కళ్ళల్లో నిండిన ఆనంద భాష్పాలే... ఈ ప్రభుత్వ పాలనకు నిజమైన ఆశీస్సులు అని అన్నారు.

రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.. కేంద్ర సహకారంతో హెల్ది వెల్తి హ్యాపీ ఆంధ్రప్రదేశ్ కు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు బాటలు వేస్తున్నారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్న కూటమి ప్రభుత్వంలో సహాయం పొందుతున్న ప్రతి లబ్ధిదారు కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

సకాలంలో నిధులు విడుదల చేస్తూ పేదలను ఆదుకుంటున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆపత్కాలంలో తక్షణ ఆర్థిక సాయం అందించి ఆదుకున్నందుకు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, స్థానిక శాసనసభ్యులు, మంత్రి దుర్గేష్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రజాదర్బార్‌లో ప్రజల వినతులు స్వీకరించిన మంత్రి అచ్చెన్నాయుడు

○ భారీగా తరలివచ్చిన ప్రజలు



**నిమ్మాడ, ఆగస్టు 3 (జర్నలిస్ట్ ఫైల్)** రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, పశుసంవర్ధక, పాల, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. నిర్విరామంగా ప్రజలతో మాట్లాడివారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో వినతిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ సంబంధిత శాఖలఅధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి, అర్హత కలిగిన ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ రహదారుల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీల్లో ఒకటైన ఇంటింటికీ తాగునీటి సరఫరా అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. సుమారు రూ. 650 కోట్ల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి ప్రాజెక్టును ఏడాదిన్నరలోగా పూర్తి చేసి, ప్రతి గ్రామంలో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు నిర్మించి, ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రతి వినతిని సానుకూలంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే పారదర్శక పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

**భారీగా తరలివచ్చిన ప్రజలు :** మంత్రి అచ్చెన్నాయుడిని కలిసేందుకు టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు నిమ్మాడ క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. రహదారులు, తాగునీరు, గృహాలు, సంక్షేమ పథకాలు, రెవెన్యూ, విద్యుత్, పింఛన్లు తదితర అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. వచ్చిన ప్రతి వినతిని నమోదు చేయించి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి త్వరితగతిన పరిష్కారం చూపాలని మంత్రి ఆదేశించారు.

## పాపులర్ షూ మార్ట్ అధినేత కన్నుమూత



**అమరావతి, ఆగస్టు 3 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రముఖ పారిశ్రామిక వేత్త, పాపులర్ షూ మార్ట్ అధినేత చుక్కపల్లి విజయ్ కుమార్ (67) గుండెపోటుతో మరణించారు. విజయవాడకు చెందిన ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. విజయ్ కుమార్ మృతిపట్ల పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, నగర ప్రముఖులు సంతాపం తెలిపారు. మాజీ కేంద్రమంత్రి, విజయవాడ వెస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ చౌదరి ఆయన మరణంపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం వ్యాపార రంగంతో పాటు సామాజిక సేవారంగానికి తీరని లోటన్నారు. కష్టపడి ఎదిగి, యువ పారిశ్రామిక వేత్తలకు ఆయన ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ప్రస్తుతం ఆయన భౌతిక కాయాన్ని గాంధీనగర్లోని పాపులర్ షూ మార్ట్ షాపులో ఉంచారు. మంగళవారం అంతిమ యాత్ర, దహన సంస్కారాలు నిర్వహిస్తామని, కృష్ణలంక స్వర్గపురిలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఎమ్మార్సీ నిర్వహణ గ్రాంట్లు పెంచి విడుదల చేయాలి

○ సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఎంఈఓ-1 అసోసియేషన్ వినతి

○ పాఠశాలల పర్యవేక్షణకు వాహన సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** మండల వనరుల కేంద్రాల (ఎమ్మార్సీ) నిర్వహణ గ్రాంట్లను వెంటనే విడుదల చేయడంతో పాటు వాటి మొత్తాన్ని పెంచాలని ఎంఈఓ-1 అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం కోరారు. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

మండల విద్యాశాఖ కార్యాలయాల నిర్వహణ వ్యయాలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం సమగ్ర శిక్ష ద్వారా విడుదల చేస్తున్న ఎమ్మార్సీ నిర్వహణ గ్రాంటును రూ. 2 లక్షలకు పెంచాలని అసోసియేషన్ తరఫున విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న గ్రాంట్లను వెంటనే విడుదల చేయాలని కోరినట్లు వెల్లడించారు.

పాఠశాలల పర్యవేక్షణ, తనిఖీ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎంఈఓలకు వాహన సౌకర్యం కల్పించాలని, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులుగా సీనియర్ ఎంఈఓ-1లను నియమించాలని వినతిపత్రంలో కోరినట్లు సింహాచలం తెలిపారు. ప్రస్తుతం మండలాల్లో నిర్మించిన ఎంఈఓ కార్యాలయ భవనాల్లో ఎంఈఓలకు ప్రత్యేక ఛాంబర్లు ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

తమ వినతిపై సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని సింహాచలం తెలిపారు. ఇందుకు ఎంఈఓ--1 అసోసియేషన్ తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ--1 అసోసియేషన్ ఏఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు బాబురావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధనంజయ మజ్జి, విశాఖ జిల్లా అధ్యక్షుడు రవీంద్రబాబు, విజయనగరం జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ. తిరుమలరావు, చెల్లయ్య, కృష్ణమూర్తి నాయక్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య శాఖ పేరుతో ఉద్యోగాల మోసం

○ నకిలీ నియామక లేఖలపై సీఐడీకి ఫిర్యాదు

○ డబ్బులు అడిగితే నమ్మొద్దని నిరుద్యోగులకు అధికారుల హెచ్చరిక

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ పేరుతో నకిలీ నియామకాల మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభుత్వ చిహ్నాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముద్రలు, నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పేరు, మంగళగిరిలోని ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయ చిరునామాను అక్రమంగా ఉపయోగించి నకిలీ నియామక ప్రకటనలు, ఇంటర్వ్యూ కాల్ లెటర్లు, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు రూపొందించి నిరుద్యోగులను మోసం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంపై ఆరోగ్య శాఖ కార్యదర్శి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ వీరపాండియన్ ఆదేశాల మేరకు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డి. ప్రకాష్ రావు డీజీపీ కార్యాలయంలోని సీఐడీ డైరెక్టర్ జనరల్ రవిశంకర్ అయ్యన్నార్‌కు రాతపూర్వకంగా సోమవారం ఫిర్యాదు చేశారు.

**అధికారిక వెబ్ సైట్ చూడాలి**

వాట్సాప్, ఈ-మెయిల్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా నకిలీ ఉద్యోగ ప్రకటనలు పంపించి, ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి నిరుద్యోగులనుశీచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఉద్యోగం కోసం ప్రాసెసింగ్ ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు, సర్టిఫికెట్ ధ్రువీకరణ పేరుతో ఎలాంటి మొత్తాలు చెల్లించవద్దని అధికారులు స్పష్టంచేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో నియామకాలు కేవలం ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక మండలి (ఏపీఎంఎస్‌ఆర్‌బీ), జిల్లాల్లో కలెక్టర్ నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా నియామకాలు జరుగుతాయని తెలిపారు. ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్లు, దరఖాస్తులు, ఇంటర్వ్యూలు, ఫలితాల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే పరిశీలించాలని సూచించారు. అనుమానాస్పద సందేశాలు, నకిలీ నియామక లేఖలు అందినట్లయితే వెంటనే పోలీసులకు లేదా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## సంస్కృతాభివృద్ధిపై జాతీయ సంస్కృత యూనివర్సిటీ వీసీతో విల్సన్ భేటీ



○ సంస్కృత సప్తాహం ముగింపు కార్యక్రమానికి ఆహ్వానం

○ హాజరుకు సూత్రప్రాయంగా అంగీకరించిన వీసీ

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో సంస్కృత భాష అభివృద్ధి, ప్రాచుర్యానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆంధ్రప్రదేశ్ తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ (శరత్ చంద్ర) సోమవారం న్యూఢిల్లీలోని శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ సంస్కృత యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మురళీ మనోహర్ పాఠక్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సంస్కృత భాషాభివృద్ధికి పరస్పర సహకారంతో చేపట్టే కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఆగస్టు 25 నుంచి 31 వరకు నిర్వహించనున్న సంస్కృత సప్తాహం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని విల్సన్ వీసీని ఆహ్వానించారు. కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రొఫెసర్ మురళీ మనోహర్ పాఠక్ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు వెల్లడించారు.

ఈ భేటీలో బీజేపీ నాయకుడు తాండవ కృష్ణ కూడా పాల్గొన్నారు.

## ప్రధాని మోదీకి కృతజ్ఞతలు చెప్పడాన్ని విమర్శించడం ఆశ్చర్యకరం


○ కేంద్ర సహకారాన్ని గుర్తించడం రాజకీయాలు కాదు.. రాష్ట్ర ప్రయోజనాల పట్ల బాధ్యత

○ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రానికి కృతజ్ఞతలు చెప్పడంలో తప్పేముంది?

○ సానుకూల రాజకీయాలే దేశ, రాష్ట్రాభివృద్ధికి మార్గం

○ ప్రజలు అంధ వ్యతిరేకతను కాదు... అభివృద్ధి రాజకీయాలను కోరుకుంటున్నారు

○ బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ వేదికపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలియజేయడాన్ని సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ విమర్శించడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు.

రామకృష్ణపై తమకు వ్యక్తిగత గౌరవం ఎప్పటికీ ఉంటుందని, అయితే కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అందిస్తున్న సహకారాన్ని గుర్తించి కృతజ్ఞతలు తెలియజేయడం రాజకీయాలు కాదని, అది రాష్ట్ర ప్రయోజనాలను గుర్తించే బాధ్యతాయుత నాయకత్వ లక్షణమని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం అందిస్తున్న సహకారాన్ని బహిరంగంగా అభినందించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆరోగ్యకరమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని, దానిని రాజకీయ కోణంలో చూడటం సమంజసం కాదన్నారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, జాతీయ రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాల అభివృద్ధితో పాటు కేంద్ర సంక్షేమ పథకాల అమలు, పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణ వంటి అనేక కీలక రంగాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అపూర్వమైన సహకారాన్ని అందిస్తోందని జయప్రకాశ్ నారాయణ తెలిపారు. రాష్ట్ర పునర్నిర్మాణ దశలో కేంద్ర సహకారం ఎంతో కీలకమని, అలాంటి సహకారానికి కృతజ్ఞతలు తెలియజేయడం రాజకీయ ప్రయోజనాల కోసం కాదని, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.

దురదృష్టవశాత్తూ దేశ ప్రధానమంత్రిని, భారత పార్లమెంటును, భారత రాజ్యాంగ వ్యవస్థలను, భారతమాతను కొందరు అత్యంత అసభ్య పదజాలంతో అవమానించిన సందర్భాల్లో కమ్యూనిస్టు నాయకుల నుంచి అదే స్థాయిలో ఖండన వ్యక్తం కాలేదని జయప్రకాశ్ నారాయణ విమర్శించారు. దేశ గౌరవం, జాతీయ సంస్థల ప్రతిష్ఠ విషయంలో మౌనం పాటిస్తూ, అభివృద్ధికి కృతజ్ఞతలు తెలిపిన వారినే విమర్శించడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

భారతదేశంలో కమ్యూనిస్టు సిద్ధాంతానికి ప్రజలు ఇప్పటికే స్పష్టమైన తీర్పు ఇచ్చారని జయప్రకాశ్ నారాయణ వ్యాఖ్యానించారు. ఒకప్పుడు పలు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీలు అభివృద్ధి, పెట్టుబడులు, సంస్కరణలు, ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా వ్యవహరించడం వల్ల నేడు రాజకీయంగా బలహీనపడ్డాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కూడా కొద్ది దేశాలను మినహాయిస్తే కమ్యూనిస్టు సిద్ధాంతం తన ప్రాధాన్యతను కోల్పోయిందని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని నేటి భారత్ అభివృద్ధి, జాతీయత, ప్రజాస్వామ్యం, యువత ఆకాంక్షల దిశగా వేగంగా ముందుకు సాగుతోందని, ఇలాంటి సమయంలో పాత సిద్ధాంతాల బంధనంలోనే కొనసాగకుండా దేశం, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కమ్యూనిస్టు నాయకులు కూడా ఆలోచించాలని సూచించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజకీయ పార్టీలు తమ వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ దశలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని రాజకీయ కళ్లజోడుతో కాకుండా ప్రజల ప్రయోజనాల దృష్టితో చూడాలని జయప్రకాశ్ నారాయణ కోరారు. రాష్ట్రానికి మేలు చేసే ప్రతి నిర్ణయాన్ని స్వాగతించడం, అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని అన్నారు. ప్రజలు ఇప్పుడు అంధ వ్యతిరేకతను కాదని, అభివృద్ధి రాజకీయాలను కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

దేశం, రాష్ట్రం మరింత పురోగతి సాధించాలంటే సానుకూల రాజకీయాలు, సహకార రాజకీయాలు, అభివృద్ధి రాజకీయాలే సరైన మార్గమని జయప్రకాశ్ నారాయణ స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజకీయాలు సాగితేనే రాష్ట్రాభివృద్ధి వేగవంతమవుతుందని ఆయన అన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467